
మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati
సంపుటి: 02 సంచిక 57 | శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-

## నేటి మాట

ఏది స్వార్ధపరమో అదే అవినీతి, స్వార్ధరహితమైనదేదో అదే నీతి



-స్వామి వివేకానంద

## డిఫెన్స్ మినిస్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..

- గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై విజ్ఞప్తి
- ఖర్గేతో సీఎం రేవంత్ సమావేశం
- ఢిల్లీలో రాజకీయ-పరిపాలన చర్చలు
- రాష్ట్ర సమస్యలపై దృష్టి




## 260 కంపెనీలతో భారత్‌కు బ్రెజిల్ అధ్యక్షుడు

- లూలా భారత్ పర్యటన
- 260 కంపెనీల బృందం
- ఢిల్లీలో బిజినెస్ మీట్
- ఏఐ సమ్మిట్ హాజరు
- వాణిజ్య భాగస్వామ్యం




## ఓటు వెయ్యలేదు.. డబ్బు గిఫ్టులు తిరిగి ఇచ్చేయండి

- ఓటుపై అనుమానాలు
- గిఫ్టుల రిటర్న్ డిమాండ్
- రోడ్డుపై కుక్కర్లు
- ఓటర్ల నిరసన
- ఎన్నికల దుమారం




## ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడులో జైషే మహ్మాద్ హస్తం : ఐరాస నివేదిక

- జైషే మహమ్మద్ ఉగ్రక్రమాలు
- మహిళల విభాగం ఆందోళన
- పహల్గాం ఉగ్రదాడి
- పాకిస్తాన్ వక్రబుద్ధి




# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై గుండె పగిలే రిపోర్ట్!




న్యూస్ డెస్క్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్):ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై సంచలన రిపోర్ట్ విడుదలకానున్నట్లు తెలుస్తోంది. భారత దర్యాప్తు సంస్థలు తుది నివేదికను సిద్ధం చేసినట్లుగా వర్గాలు పేర్కొన్నాయి. ఈ రిపోర్ట్‌లో గుండె పగిలే విషయాలు ఉన్నట్లుగా కథనాలు పేర్కొన్నాయి.

జూన్ 12, 2025న ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు వెళ్తుండగా సెకన్ల వ్యవధిలోనే హాస్టల్‌పై కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఒక్కరు మినహా 241 మంది చనిపోగా.. హాస్టల్‌లో ఉన్న పలువురు మెడికోలు కూడా మృతిచెందారు. మొత్తంగా 271 మంది మృత్యువాత పడ్డారు.

అనంతరం ఈ ప్రమాదంపై రెండు భారత సంస్థలు దర్యాప్తు చేపట్టాయి. నెలరోజుల తర్వాత భారతదేశ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక రిపోర్టును విడుదల చేసింది. అందులో ఇంధన స్విచ్‌లు ఆపేసినట్లుగా వెల్లడించింది. ఈ రిపోర్ట్‌పై అంతర్జాతీయ మీడియాలో పైలట్ ఆత్మహత్య కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లుగా కథనాలు ప్రచారం చేశాయి. ఈ కథనాలపై పైలట్ సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. తుది నివేదిక రాకుండా ఎలా చెబుతారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాజాగా అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై తుది నివేదిక సిద్ధమైనట్లుగా వర్గాలు పేర్కొన్నాయి.

## లోక్ సభలో బిగ్ ట్విస్ట్

### రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత




న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భారత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. బడ్జెట్ 2026-27 పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. సభలో సంచలన వ్యాఖ్యలతో పాటు ఆరోపణలు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీ పై తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం 'సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం' తెస్తుందని అంతా భావించారు.




# క్యాంపు రాజకీయాలు షురూ

## పోటా పోటీగా అభ్యర్థులను తరలిస్తున్న పార్టీలు


- అభ్యర్థుల భద్రతే లక్ష్యం
- ఫామ్‌హౌస్ క్యాంపులకు తరలింపు
- సూర్యాపేట-ఆసిఫాబాద్‌లలో హీట్
- చెన్నూర్-కేతనపల్లిపై ఉత్కంఠ
- హైదరాబాద్ శివారుల్లో రాజకీయ మంతనాలు
- మున్సిపల్ ఎన్నికలే సెమీ ఫైనల్స్
- చైర్‌పర్సన్-మేయర్ పోరుకు రంగం సిద్ధం

మిగతా 2 లో

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్)

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల వేళ క్యాంపు రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి. ఈ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో తమ అభ్యర్థులెవరూ చేజారకుండా ఉండేందుకు ప్రధాన పార్టీలు క్యాంపు రాజకీయాలను షురూ చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో పాటు తమకు అందిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఆయా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పోటీ చేసిన తమ అభ్యర్థులందరిని శిబిరాలకు తరలిస్తున్నాయి. అయితే నిన్న జరిగిన ఈ ఎన్నికకు సంబంధించి రేపు ఫలితాలు వెలువడబోతున్నాయి. ఇంకా ఫలితాలు వెలువడకముందే పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపడంతో స్టేట్ పాలిటిక్స్ మరింత రసవత్తరంగా మారుతోంది.

## మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య కేసులో బిగ్ ట్విస్ట్..




న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపిన మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య కేసు కీలక మలుపు తిరిగింది. అధికార కాంగ్రెస్ పార్టీ బెదిరింపుల వల్లే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న వేళ తన భర్త ఆత్మహత్యపై మృతుడి భార్య సత్యమ్మ క్లారిటీ ఇచ్చింది. ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు తాజాగా వెలుగులోకి వచ్చింది.

## జాహ్నవి కందుల కేసులో కీలక పరిణామం

### రూ.262 కోట్లు చారిత్రాత్మక పరిహారం




న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): అమెరికాలో ప్రాణాలు కోల్పోయిన జాహ్నవి కందుల కేసు లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆమె మరణానికి పరిహారంగా రూ.262 కోట్లు ఇవ్వాలని స్థానిక ప్రభుత్వం (ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి కందుల (23), ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి సియాటెల్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతోంది.

# సైబర్ మోసాలకు బ్యాంకులదే బాధ్యత




న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సైబర్ మోసాలు ఇప్పుడు వ్యక్తులకే పరిమితం కాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థకే పెను సవాలుగా పరిణమించాయి. డిజిటల్ లావాదేవీలు విస్తృతమవుతున్న వేళ.. ఫిషింగ్ లింకులు, నకిలీ కాల్ సెంటర్లు, కేవైసీ అప్ డేట్, ఇన్వెస్ట్ మెంట్ యాప్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ. కోట్లు కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా యూపీఐ, ఆన్ లైన్ బ్యాంకింగ్ వేదికలే లక్ష్యంగా ఈ దోపిడీ సాగుతోంది. రోజురోజుకు ఫిర్యాదులు వెల్లువలా వస్తుండడంతో కేంద్రం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా బాధితుల నష్టాన్ని తగ్గించేలా, బ్యాంకుల బాధ్యతను స్పష్టంగా నిర్ధారిస్తూ కేంద్ర హోంశాఖ సరికొత్త 'ఎస్ఓపీ' (స్టాండర్డ్ ఆపరేటింగ్ గైడ్ లైన్స్) నిబంధనలకు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం రూ. 50 వేల లోపు మోసాలు జరిగినప్పుడు.. కోర్టు ఆదేశాలు అవసరం లేకుండానే బ్యాంకులు 90 రోజుల్లోపు బాధితులకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

**ఆర్బీఐ కీలక ప్రతిపాదనలు**

చిన్న మొత్తాల్లో జరిగే మోసాలకు సంబంధించి బాధితులకు పరిహారం అందించాలని మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీటీ) సమావేశంలో ప్రతిపాదించారు. దీని ప్రకారం బాధితులు నష్టపోయిన మొత్తంలో 85 శాతం లేదా రూ. 25 వేలు.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని చెల్లించనున్నారు. అయితే ఈ పరిహారం జీవితకాలంలో ఒకసారి మాత్రమే పొందే అవకాశముంటుంది. త్వరలోనే ఇందుకు సంబంధించి పూర్తిస్థాయి మార్గదర్శకాలు విడుదల కానున్నాయి.

గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా ఆన్ లైన్ మోసాల వల్ల బాధితులు ఏకంగా రూ.52,976 కోట్లు నష్టపోయారని కేంద్రం వెల్లడించింది. ఆర్బీఐ డేటా ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 29,080 మోసాలు జరిగి. రూ. 1,457 కోట్ల నష్టం జరిగింది.

# రిబ్బన్లు కట్ చేయడం తప్ప ఇంకేం చేశారు?

## కల్తీ ఆహారంపై హరీష్ రావు అసహనం




న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గురుకులాలు, ఓయూలో భోజనం బాలేదని విద్యార్థులు రోడ్డెక్కుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఎక్స్ వేదికగా ఆరోపించారు. సీఎం పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి.. గురుకులాల్లో ఉన్న అధ్వాన్న పరిస్థితులపై సమీక్షించలేరా? అని ప్రశ్నించారు. కల్తీ ఆహారం తమకొద్దని నారాయణఖేడ్ మండలం ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కడం, భోజనం బాగుండటం లేదని హైదరాబాద్ నడిగడ్డపై ఉస్మానియా విద్యార్థులు రాత్రి నుంచి నిరసన చేయడం సీఎంకు కనిపించడం లేదా అని నిలదీశారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నా.. విద్యాశాఖను తనవద్దే ఉంచుకున్న సీఎం ఉలుకు పలుకు లేకుండా ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు.

నిత్యం గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గరుకులాల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై సమీక్షించే తీరిక లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఉస్మానియాకు వెళ్లి రిబ్బన్లు కట్ చేయడం తప్ప రెండున్నరేండ్లుగా చేసిన అభివృద్ధి ఏముంది? మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటది అనడానికి ముఖ్యమంత్రి పర్ఫెక్ట్ ఉదాహరణ అని హరీష్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే అంటూ ఇప్పటి వరకు 62 సార్లు ఢిల్లీకి పోయిన రేవంత్ రెడ్డి.. ఏం సాధించారో మొన్నటి కేంద్ర బడ్జెట్ తోనే తేటతెల్లమైందన్నారు.

# విశాఖ భూముల కేటాయింపు రచ్చ.. మండలి నుంచి వైసీపీ వాకౌట్

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏపీ శాసనమండలిలో విశాఖలో ఐటీ కంపెనీలకు 99 పైసలకే భూములు కేటాయించడంపై టీడీపీ మంత్రులు, వైసీపీ ఎమ్మెల్సీల మధ్య వాడి-వేడి చర్చ జరిగింది. రియల్ ఎస్టేట్ కంపెనీలకు కూడా భూములు ఎలా ఇస్తారని వైసీపీ ప్రశ్నించగా.. దానిపై మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు వివరణ ఇచ్చారు. ఏపీకి కంపెనీలు రావడం వైసీపీకి నచ్చడం లేదన్నారు. విశాఖలో ఎకో సిస్టం క్రియేట్ చేయాలంటే పెద్ద కంపెనీలు రావాలని, అందుకే ఐదు కంపెనీలకు భూములు లీజుకిచ్చామన్నారు. ఒక్క విశాఖలోనే 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని లోకేశ్ తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో కంపెనీలు కోట్లు ఖర్చుచేసి భూములు కొంటుంటే.. విశాఖలో విలువైన భూముల్ని అతితక్కువకే ఇవ్వడాన్ని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తప్పుపట్టారు. రూ.5 వేల కోట్ల విలువైన భూముల్ని గీతం యూనివర్సిటీకి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై అధికార- విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. విలువైన విశాఖ భూములను అప్పనంగా కట్టబెట్టారని విపక్ష సభ్యులు ఆరోపించారు. ప్రభుత్వం భూదోపిడీకి పాల్పడుతోందన్నారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు శాసనమండలి నుంచి వాకౌట్ చేశారు. దీంతో వైసీపీకి వాకౌట్ చేయడం ఒక అలవాటుగా మారిందని నారా లోకేశ్ విమర్శించారు.

# జాహ్నవి కందుల కేసులో కీలక పరిణామం రూ.262 కోట్ల చారిత్రాత్మక పరిహారం

**మొదటి పేజీ తరువాయి**

2023 జనవరి 23న రాత్రి వేళ ఆమె రోడ్డు దాటుతుండగా, కెవిన్ దేవ్ అనే పోలీస్ అధికారి నడుపుతున్న పెట్రోలింగ్ కారు గంటకు 119 కిలోమీటర్ల వేగంతో వచ్చి ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

ఈ ప్రమాదం జరిగిన తర్వాత, మరో పోలీస్ అధికారి డేనియల్ అడరర్ తన బాడీ కెమెరా ఆన్‌లో ఉండగానే అత్యంత అమానవీయంగా ప్రవర్తించారు. జాహ్నవి మరణం గురించి మాట్లాడుతూ.. "ఆమె చనిపోయింది, ఆమె జీవితానికి పెద్దగా విలువ లేదు. కేవలం 11 వేల డాలర్లు (సుమారు రూ. 9 లక్షలు) ఇస్తే సరిపోతుంది" అంటూ నవ్వుతూ వెటకారం చేశారు. ఈ వీడియో బయటకు రావడంతో ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా భారత్‌లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అనంతరం జాహ్నవి కుటుంబం అమెరికా కోర్టులో సియాటెల్ నగర యంత్రాంగం పై దావా వేసింది.

సుదీర్ఘ విచారణ అనంతరం, సియాటెల్ సిటీ కౌన్సిల్, బాధితురాలి కుటుంబం మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం జాహ్నవి కుటుంబానికి 31.1 మిలియన్ డాలర్లు భారీ పరిహారంగా చెల్లించాలని నగర యంత్రాంగం నిర్ణయించింది. ఈ పరిహారంలో సియాటెల్ నగరం నేరుగా 5 మిలియన్ డాలర్లు చెల్లిస్తుండగా, మిగిలిన మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అందజేస్తారు. దీంతో పాటు, విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన, అమానవీయ వ్యాఖ్యలు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునే ప్రక్రియ కూడా కొనసాగుతోందని కోర్టు స్పష్టం చేసింది.

# సైబర్ మోసాలకు బ్యాంకులదే బాధ్యత

**మొదటి పేజీ తరువాయి**

2024-25లో కార్డ్, ఇంటర్నెట్ ఆధారిత లావాదేవీలకు సంబంధించిన 13,469 మోసాల కేసులు నమోదు కాగా, వీటి వల్ల రూ. 520 కోట్ల నష్టం వాటిల్లిందని బ్యాంకులు నివేదించాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం బాధితులకు వేగంగా ఊరటనిస్తాయని భావిస్తున్నారు.

ముఖ్యంగా డిజిటల్ లావాదేవీలు అధికంగా జరిగే హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో ఈ నిర్ణయం కీలకం కానుంది. ఇకపై పేమెంట్ సంస్థలు, స్టాక్ ట్రేడింగ్ యాప్‌లు సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే మూడంచెల వ్యవస్థలో స్పందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటేనే ఈ డిజిటల్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణలో తగ్గిన సైబర్ మోసాలు..

సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ జాతీయ సగటును మించి మెరుగైన ఫలితాలను సాధిస్తుంది. దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు దాదాపుగా 24 శాతం పెరిగితే.. మన రాష్ట్రంలో మాత్రం 2025 లో ఫిర్యాదుల సంఖ్య 6 శాతం తగ్గింది. 2024లో 96,535 ఫిర్యాదులు నమోదు కాగా, 2025లో అవి 90,369కి తగ్గాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థిక నష్టాలు కూడా 23 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. బాధితులు కోల్పోయిన నష్టం రూ.1,901 కోట్ల నుంచి రూ.1,524 కోట్లకు తగ్గింది. సైబర్ మోసాలకు సంబంధించి 2024, 2025 లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూ.534 కోట్లను ఫ్రీజ్ చేసింది. ఇందులో సుమారు 47 వేల మంది బాధితులకు రూ.367 కోట్లు తిరిగి చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు.

కొత్త ఎస్ఓపీ నిబంధనలు ఇలా..

- అనుమానాస్పద లావాదేవీలను వెంటనే గుర్తించే వ్యవస్థలను బ్యాంకులు ఏర్పాటు చేసుకోవాలి.
- కస్టమర్ ఫిర్యాదు అందిన వెంటనే ఖాతాలు ఫ్రీజ్ చేయాలి.
- మోసపోయిన మొత్తం తిరిగి పొందేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.
- భద్రతా ప్రమాణాలు పాటించని బ్యాంకులపై జరిమానాలు విధిస్తారు.

# డిఫెన్స్ మినిస్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. గురువారం ఉదయం దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈసా.. మూసీ నదుల సంగమ స్థలంలో కార్యక్రమం చేపడుతున్నట్లు రక్షణ మంత్రికి సీఎం వివరించారు. 1948 ఫిబ్రవరిలో మహాత్ముని చితభస్మాన్ని ఈసా.. మూసీ సంగమ స్థలిలో నిమజ్జనం చేశారని కేంద్ర మంత్రికి తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్పష్టం చేశారు. బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. అంతకు ముందు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయాలు, పరిపాలన అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించారు. దావోస్ పర్యటన, హార్వర్డ్ శిక్షణ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను వివరించారు. రేవంత్ రెడ్డి కొందరు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను వారి దష్టికి తీసుకెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంటుకు వెళ్లి ఎంపీలను కలిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.

# పంచాయతీలకు గుడ్ న్యూస్.. మరో రూ.387 కోట్లు విడుదల

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తెలంగాణ గ్రామపంచాయతీలకు కేంద్ర శుభవార్త అందించింది. వారంరోజుల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో భాగంగా తొలివిడతలో రూ.259.36 కోట్లు రిలీజ్ చేసింది. తాజాగా మరో రూ.387 కోట్ల నిధులను విడుదల చేసింది. గ్రామపంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడంతో.. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల కూడా ఆలస్యమైంది. రెండు విడతల్లో కలిపి మొత్తం రూ.646.46 కోట్లను రిలీజ్ చేసింది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో పెండింగ్లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. ఇంకా రూ.2400 కోట్ల నిధులు కేంద్రం నుంచి గ్రామపంచాయతీలకు రావలసి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండాలంటే కేంద్రం పెండింగ్ లో ఉన్న నిధులను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీశాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. కేంద్రం చెప్పిన నిబంధనలన్నీ రాష్ట్ర ప్రభుత్వం పాటించిందని, సకాలంలో ఫండ్స్ అందితేనే గ్రామాల రూపురేఖలు అభివృద్ధితో మారుతాయన్నారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై గుండె పగిలే రిపోర్ట్!

**మొదటి పేజీ తరువాయి**

ఉద్దేశపూర్వకంగానే పైలట్ ఇంధన స్విచ్‌లు ఆపేసినట్లుగా నివేదికలు అందుతున్నాయి. ఎయిరిండియా విమానంలో ఎలాంటి సాంకేతిక లోపం లేనట్లుగా తేల్చాయి. ఇంజిన్ ఇంధన నియంత్రణ స్విచ్‌లను మాన్యువల్‌గా షట్‌డౌన్ చేయడంలో ఉద్దేశపూర్వకంగా జరిగిందని తాజా వార్తా నివేదిక పేర్కొంది.

తాజాగా న్యూఢిల్లీ-వాషింగ్టన్ మధ్య కీలక చర్చలు జరిగాయి. ఈ చర్చలతో సంబంధం ఉన్న రెండు వర్గాలను ఉటంకిస్తూ ఇటాలియన్ దినపత్రిక కొరియల్ డెల్లా సెరా ఈ వార్తను నివేదించింది. ఈ ప్రమాదం కచ్చితంగా "ఉద్దేశపూర్వక చర్య"గా కథనంలో తేల్చి చెప్పింది. తుది నివేదికను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొంది. వాషింగ్టన్‌తో భారత దర్యాప్తు సంస్థలు జరిపిన చర్చల తర్వాత ప్రమాదం ఉద్దేశపూర్వకంగా జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చాయని.. దర్యాప్తులో సహాయం చేసిన అమెరికా నిపుణులను ఉద్దేశిస్తూ "ఇదొక ముందడుగు"గా అభవర్ణించినట్లుగా వార్తాపత్రిక పేర్కొంది.

ఈ సందర్భంగా కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్‌ను కూడా ప్రస్తావించింది. ఒక పైలట్... "మీరు ఇంధనాన్ని ఎందుకు ఆపేశారు?" అని అడగడం వినిపించింది. మరొకరు.. "నేను అలా చేయలేదు." అని బదులిచ్చినట్లుగా రికార్డైంది.

పైలట్లలో ఒకరు ఇంజిన్ ఇంధన నియంత్రణ స్విచ్‌లను ఆపివేయడం వల్ల విమానం శక్తిని కోల్పోయి నేలపై పడిపోయిందని దర్యాప్తు అధికారులు ఇప్పుడు నమ్ముతున్నారని కథనంలో పేర్కొంది. కెప్టెన్ సుమీత్ సభర్వాల్, కో-పైలట్ క్లైవ్ కుందర్గా మధ్య సంభాషణను భారత్ సంస్థలు అంగీకరించినట్లుగా ఇటాలియన్ వార్తాపత్రిక స్పష్టం చేసింది. ప్రధాన అనుమానితుడు కెప్టెన్ సుమీత్ సభర్వాల్ బాధ్యతలు అస్పష్టంగానే ఉన్నాయని.. చాలా రోజుల నుంచి మానసికంగా నిరాశతో బాధపడుతున్నట్లుగా కథనంలో వెల్లడించింది.

గతంలో ప్రాథమిక రిపోర్ట్‌లో పైలట్ తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నివేదికలు వచ్చినప్పుడు పైలట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అంతేకాకుండా పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి.. మానసిక ఆరోగ్యంపై వచ్చిన ఊహాగానాలు తోసిపుచ్చారు. అంతేకాకుండా భార్యతో విడాకులు.. వ్యక్తిగత సమస్యలు లేవన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో తుది నివేదిక వచ్చేంత వరకు ఏమీ అనవద్దని సూచించింది. తాజాగా పైలట్ తప్పిదం వల్లే ప్రమాదం జరిగినట్లుగా దర్యాప్తు సంస్థలు ఒక ముగింపునకు వచ్చినట్లు వర్గాలు పేర్కొన్నాయి. త్వరలోనే ఫైనల్ రిపోర్ట్ విడుదల కానుంది.

# 260 కంపెనీలతో భారత్‌కు బ్రెజిల్ అధ్యక్షుడు

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బ్రెజిల్ ప్రెసిడెంట్ లూలా డ సిల్వా భారత పర్యటనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏకంగా 260 కంపెనీలకు చెందిన డెలిగేషన్‌తో ఆయన ఈ నెల 19 నుంచి 21 వరకు మూడ్రోజుల పర్యటనకు వస్తున్నట్లు ఆ దేశ విదేశాంగ శాఖ తెలిపింది. భారత్‌కు వస్తున్న ఈ బృందం.. బ్రెజిల్ చరిత్రలో విదేశీ పర్యటనకు వెళ్తున్న అతిపెద్ద బృందం కావడం గమనార్హం. అంతేకాదు బ్రెజిల్‌లో ఎన్నికలకు ముందు అధ్యక్షుడు లూలా చివరి విదేశీ పర్యటన కూడా ఇదే. గతేడాది జులైలో బ్రెజిల్ వెళ్లిన ప్రధాని మోడీ.. లూలాతో పలు కీలక అంశాలపై చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్‌లో లూలా పర్యటనకు బ్రెజిల్ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రెసిడెంట్ లూలా ప్రిన్సిపల్ ఫారెన్ పాలసీ సలహాదారు సెల్సో అమోరిమ్ తెలిపారు.

వ్యూహాత్మక రంగాలు, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో సహకారానికి ఈ పర్యటనలో పెద్దపీట వేయనున్నట్లు సమాచారం. ఢిల్లీలో జరిగే ఏఐ సమ్మిట్‌లో ప్రెసిడెంట్ లూలా పాల్గొంటారని, అదే సమయంలో విదేశాంగ శాఖ సహకారంతో భారీ బిజినెస్ సమావేశం ఏర్పాటు చేయనున్నామని బ్రెజిల్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ హెడ్ జార్జ్ వియానా తెలిపారు. భారత్‌కు తాము చేసే ఎగుమతులను ఇతర రంగాలకు కూడా వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. 260 బ్రెజిల్ కంపెనీల ప్రతినిధులు ఢిల్లీలో జరిగే బిజినెస్ మీటింగ్‌లో పాల్గొంటారని స్పష్టంచేశారు.

# ఓటు వెయ్యలేదు.. డబ్బు గిఫ్టులు తిరిగి ఇచ్చేయండి

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో 10వ వార్డులో అధికార కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదని, పంపిణీ చేసిన నగదు కుక్కర్లను తిరిగి ఇచ్చేయాలని సదరు అభ్యర్థి మిండా హరిబాబు అడిగాడంటూ ఓటర్లు ఆందోళనకు దిగారు. బుధవారం జరిగిన ఎన్నికల పోలింగ్ లో కొందరు తనకు ఓటు వేయలేదనే అనుమానంతో తాను పంపిణీ చేసిన ఓటుకు రూ.2500 రూపాయలు, కుక్కర్లను తిరిగి ఇచ్చేయాలని సదరు అభ్యర్థి కోరాడని కుక్కర్లను రోడ్డుపై పడేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు విడుదల కాకముందే ఈ విధంగా ఓటేయలేదని తమని వేధిస్తున్నారంటూ ఓటర్లు వాపోయారు. తాము అడగకుండానే ఇళ్లకు తీసుకువచ్చి మరి కుక్కర్లు పంపిణీ చేసి.. ఇప్పుడు తిరిగి ఇవ్వాలని అనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఓటు వేయలేదని అసలు ఎలా నిర్ధారిస్తారన్నారు. 10వ వార్డులో కనీస మౌలిక సదుపాయాలు లేక నానా ఇబ్బందులు పడుతుంటే.. పోటీ చేసిన అభ్యర్థి ఈ విధంగా తమను వేధించడం తగదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అది ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నగదు గిఫ్టులు పంపిణీ బట్టబయలు అవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

# భారత వాయుసేన మరింత బలోపేతం.. 114 రఫేల్ విమానాల కొనుగోలుకు డీఏసీ అనుమతి

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య మరింత పెంచుకోవాలని భారత్ భావిస్తున్నది. అందులో భాగంగా ఫ్రాన్స్ నుంచి యుద్ధ విమానాల కొనుగోలు విషయమై రక్షణ శాఖ చేసిన ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పింది.

రూ.3.25 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో అతిపెద్ద రక్షణ ఒప్పందం చేసుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే తాజా డీల్‌కు ఆమోదం లభించడం గమనార్హం.

ఈ 114 రఫేల్ యుద్ధ విమానాల్లో 88 సింగిల్ సీటర్, 26 ట్విన్ సీటర్ వేరియంట్‌లు ఉన్నాయి. అదేవిధంగా మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబ్లింగ్ వంటి వాటి కోసం ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్.. భారత్‌లోని ప్రైవేట్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోనుంది. కాగా భారత వాయుసేన దగ్గర ఇప్పటికే 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

# ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడులో జైషే మహ్మద్ హస్తం : ఐరాస నివేదిక

న్యూస్ డెస్క్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దేశ రాజధానిలోని ఎర్రకోట సమీపంలో గతేడాది జరిగిన టెర్రర్ అటాక్ పై ఐక్యరాజ్యసమితి కీలక నివేదిక విడుదల చేసింది. ఐరాస భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ దాడికి.. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహమ్మద్ ఉగ్రమూకతో సంబంధం ఉన్నట్లు నివేదికలో పేర్కొంది. పాకిస్థాన్లో ఆర్థికపరమైన ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నా.. జైషేతోపాటు పలు ఉగ్రమూకలు సౌత్ ఏషియాలో క్రియాశీలకంగా పావులు కదుపుతున్నాయని కూడా తెలిపింది. జైషే ముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు అనుమానించిన ఐరాస.. వాటిలో గతేడాది నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన దాడి కూడా ఒకటి అని ఆరోపించింది. జమాత్ ఉల్ మువినత్ పేరుతో ఒక మహిళా వింగ్ ను కూడా ఏర్పాటు చేసుకుందని, ఇది ఆందోళనకర పరిణామంగా పేర్కొంది. జమ్మూకశ్మీర్లో జరిగిన పహల్గాం ఉగ్రదాడి ఘటనను కూడా ఈ నివేదికలో ప్రస్తావించింది. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు కూడా తెలిపింది. జైషే, లష్కరే తొయిబా వంటి ఉగ్రమూకలు తమ దేశంలో ఉనికిలో లేవని కొంతకాలంగా పాకిస్థాన్ వాదిస్తుండగా.. తాజాగా వచ్చిన నివేదికతో పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడింది.

# క్యాంపు రాజకీయాలు షురూ.. పోటా పోటీగా అభ్యర్థులను తరలిస్తున్న పార్టీలు

**మొదటి పేజీ తరువాయి**

వారికి అందుబాటులో ఉండేలా:

సూర్యాపేట, ఆదిలాబాద్ జిల్లాలో క్యాంపు రాజకీయాలు ఇప్పుడు ఆసక్తిని రేపుతున్నాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తమ ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయి. సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థులను క్యాంపులకు తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఆసిఫాబాద్ లో బీఆర్ఎస్, బీజేపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. ఇక మంచిర్యాల జిల్లా చెన్నూర్, మరియు కేతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకోవాలని ఉద్దేశంతో ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. స్థానిక మంత్రి వివేక్ వెంకటస్వామి సెగ్మెట్ కావడంతో ఈ రెండు స్థానాలను కైవసం చేసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బీఆర్ఎస్ అభ్యర్థులను బుధవారం రాత్రే క్యాంపులకు తరలించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పార్టీ సూచన మేరకు అభ్యర్థులు సైతం తమ లగేజ్ ని సర్దుకుని క్యాంపుల బాట పడుతున్నారు. వీరినందరిని హైదరాబాద్ శివారులలోని ఫామ్ హౌస్?లోల ఏర్పాటు చేసిన క్యాంపులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయి నేతలతో మంతనాలు జరిపేందుకు వీలుగా రాజధాని శివారు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

సెమీ ఫైనల్స్ లో పై చేయి కోసం:

సాధారణంగా మున్సిపల్ ఎన్నికలు అంటేనే మినీ సంగ్రామంగా భావిస్తుంటారు. క్షేత్రస్థాయిలో పార్టీల బలాబలాలను నిరూపించేంది ఈ ఎన్నికలే. ఈ ఎన్నికల కోసం ఎంత కష్టపడ్డాం? ఎన్ని వార్డులు గెలిచామన్నది కాకుండా ఎన్ని మున్సిపాలిటీలు, ఎన్ని కార్పొరేషన్లు మన ఖాతాలో వేసుకున్నామన్నదే రాజకీయ పార్టీల గెలుపునకు గీటురాయిగా నిలుస్తుంది. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి రెఫరెండం, భవిష్యత్తులో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఇవే సెమీ ఫైనల్స్ అనే ప్రచారం జరుగుతోంది. దీంతో రాష్ట్రంలో భవిష్యత్ రాజకీయాలకు రూట్ మ్యాప్ ను డిసైడ్ చేసే ఈ ఎన్నికల్లో పై చేయి సాధించేందుకు పార్టీలు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. గెలిచిన తమ అభ్యర్థులు చేజారకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరి ఈ క్యాంపు రాజకీయాలు ఎలాంటి ఫలితాలు ఇవ్వబోతున్నాయనేది రేపు వెలువడబోయే ఫలితాలు, ఈ నెల 16న జరగబోయే చైర్‌పర్సన్/మేయర్, వైస్ చైర్‌పర్సన్/డిప్యూటీ మేయర్ ఎన్నికలతో తేలనుంది.

# రిబ్బన్లు కట్ చేయడం తప్ప ఇంకేం చేశారు? కల్తీ ఆహారంపై హరీష్ రావు అసహనం

**మొదటి పేజీ తరువాయి**

ఒకవైపు గురుకులాల ఖ్యాతిని మసకబార్చిన రేవంత్ రెడ్డి, మరో వైపు అంచనాలు పెంచి కమీషన్లు దండుకోవడానికే యంగ్ ఇండియా స్కూల్స్ పేరిట భారీ నాటకానికి తెరతీసిండని దుయ్యబట్టారు. కూట్లో రాయి తీయలేనోడు, ఏట్లో రాయి తీస్తడన్న చందంగా గురుకులాల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టలేని ప్రభుత్వం, అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పురుగుల్లేని అన్నం కోసం విద్యార్థులు నడిరోడ్డెక్కి నిరసన తెలియచేయాల్సిన దుస్థితి కల్పించడమేనా ఇందిరమ్మ రాజ్యం ఉస్మానియా విద్యార్థులు, తల్లిదండ్రులకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అవమానించడమేనా మీ ప్రజాపాలన? అని ప్రశ్నల వర్షం కురిపించారు. పరిపాలన అంటే ప్రగల్భాలు పలకడం కాదు, ప్రతిపక్షాలపై బూతుల వర్షం కురిపించడం అంతకంటే కాదన్నారు. హార్వార్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి వెళ్లి వచ్చినా కూడా.. సీఎం రేవంత్ విద్య పట్ల, విద్యార్థుల పట్ల ప్రాధాన్యం చూపకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మీద దృష్టి సారించి, గురుకుల విద్యార్థులకు పురుగుల్లేని భోజనం అందించాలని, ఉస్మానియా యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య కేసులో బిగ్ ట్విస్ట్.. అసలేం జరిగింతో క్లారిటీ ఇచ్చిన మృతుడి భార్య

**మొదటి పేజీ తరువాయి**

ఈ ఫిర్యాదులో సంచలన విషయాలు అమె పేర్కొంది. తన భర్త మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదని మా వార్డులోని ఓటర్లు నా భర్తకు ఓటు వేయరనే భయంతోనే ఆయన క్షణికావేశంలో మా ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త ఆత్మహత్య విషయంలో తగుచర్య తీసుకోవాలని కోరింది. ఈ ఫిర్యాదు కాపీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మృతుడి భార్య ఫిర్యాదు ఆధారంగా 194 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ముందు అలా ఇప్పుడు ఇలా:

అయితే భర్త ఆత్మహత్య చేసుకున్న వెంటనే మహాదేవప్ప భార్య సత్యమ్మ ఓ న్యూస్ చానల్?తో మాట్లాడుతూ తన భర్తకు ఫోన్‌లో ఏవో బెదిరింపులు వస్తున్నాయని, అందువల్ల తీవ్ర ఒత్తిడికి గురయ్యారని ఆమె ఆరోపించారు. అయితే పోలీసులకు మాత్రం ఓటమిభయంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. కాగా మంత్రి వాకిటి శ్రీహరి ఇలాకాలో పోలింగ్‌కు ఒక రోజు ముందు ఈ ఘటన చోటు చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. మహాదేవప్ప మరణంపై బీజేపీ భగ్గుమంది. మహాదేవప్ప మృతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆత్మహత్యకు పాల్పడిన రోజే బీజేపీ శ్రేణులు డీజీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ అంశం పార్లమెంట్ వరకు సైతం పాకింది. తీరా తన భర్త విషయంలో ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి భార్య స్టేట్ మెంట్ ఇవ్వడం చర్చనీయంగా మారింది.

నా కాల్ డేటా చెక్ చేసుకోండి:

మరో వైపు మహాదేవప్ప మృతి విషయంలో తనపై వస్తున్న ఆరోపణలను మంత్రి వాకిటి శ్రీహరి ఖండించారు. మహాదేవప్ప మృతికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నాపై ఆరోపణలు రుజువైతే దేనికైనా సిద్ధం అని, మృతుడికి నేను కాల్ చేయలేదని కావాలంటే నా కాల్ డేటా చెక్ చేసుకోవాలంటూ చాలెంజ్ చేశారు. రాకీయ లబ్ధికోసం ప్రతిపక్షాలు దిగజారుడు సరికాదన్నారు. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన మహదేవప్ప మరణం ఆయన కుటుంబానికి తీరని విషాదం నింపగా ఈ కేసులో పోలీసుల దర్యాప్తు ఏం తేల్చబోతోంది అనేది ఉత్కంఠగా మారింది.

# లోక్ సభలో బిగ్ ట్విస్ట్.. రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత

**మొదటి పేజీ తరువాయి**



కానీ కేంద్రం రాహుల్ పై హక్కుల తీర్మానానికి విముఖత చూపింది. అలాగే ప్రతిపక్ష నేత ప్రసంగం నుండి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై లోక్ సభలో మంత్రి హర్దీప్ సింగ్ పూరి మాట్లాడనున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికి రాహుల్ గాంధీ వ్యవహారం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

రాహుల్ గాంధీ స్పందన

తాజా పరిణామాలపై రాహుల్ గాంధీ వ్యంగ్యంగా స్పందించారు. బీజేపీ నేతలకు మీడియా ద్వారా కొన్ని "కీవర్డ్స్" అందుతున్నాయని, వాటినే వారు వాడుతున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాహుల్‌కు మద్దతుగా నిలుస్తోంది. దేశ ప్రయోజనాల గురించి మాట్లాడటం తప్పా? అని ప్రశ్నిస్తోంది. ప్రస్తుతం ఈ అంశం లోక్‌సభలో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. నిషికాంత్ దుబే ఇచ్చిన నోటీసులపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# చేవెళ్లలో పెండింగ్ రైల్వే బ్రిడ్జిలపై ఢిల్లీలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి వినతి



చేవెళ్ల, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్నటువంటి రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మరియు రైల్వే అండర్ బ్రిడ్జిల పనులు సత్వరమే చేపట్టాలని కోరుతూ పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు న్యూఢిల్లీలోని రైలు భవన్ లో రైల్వే మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న గారితో సమావేశమయ్యారు. గత సంవత్సరం శంకరపల్లి ప్రాంతానికి విచ్చేసిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ గారికి కూడా ఈ మేరకు వినతిపత్రం అందజేసినట్టు ఆయన వివరించారు. అదేవిధంగా నావంద్గి రైల్వేస్టేషన్ లో హుబ్లీ ఎక్స్ప్రెస్ రైలు నిలపడానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సానుకూల ప్రతిపాదన పంపడం జరిగిందని, దానికి అనుగుణంగా రైల్వే బోర్డు ద్వారా తక్షణం హుబ్లీ ఎక్స్ప్రెస్ రైలును ఆపడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ పట్టణంలోని జిల్లా కోర్టు వద్ద మరియు రామయ్య గూడా ప్రాంతాలలో ఉన్నటువంటి రైల్వే లెవెల్ క్రాసింగ్ ల వద్ద డిపిఆర్ లు పూర్తయిన దృష్ట్యా ఆర్ఓబి మరియు ఆర్ యు బి ల నిర్మాణానికి వెంటనే పనులు ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొండకల్, ముబారక్ పూర్, మర్పల్లి, పాత శంకర్పల్లి, మొరంగుపల్లి, గేట్ వనంపల్లి, గొల్లగూడ, నావంద్గి, సిద్ధాంతి, శాతం రాయి, ఫతేపూర్ (ఎల్.హెచ్.ఎస్) ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరగా రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారు.


# కేంద్రంపై కదం తొక్కిన కార్మిక లోకం మోత్కూరులో దద్దరిల్లిన నిరసన జ్వాల!



మోత్కూర్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలను రద్దు చెయ్యాలని, నిరంకుశ పాలనను నిరశిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం రోజున మోత్కూర్ పట్టణం అంబేద్కర్ చౌరాస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు, పాషిస్ట్ నిరంకుశ పాలనను నిరషిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఈ సమ్మె కేవలం కార్మిక సంఘాల హక్కులకు సభందించినది మాత్రమే కాదని, దేశ ప్రజలందరు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల పరిష్కారాల కోసం జరుగుతుందని అన్నారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా కొత్త విత్తనచట్టం, నూతన విద్యుత్ బిల్లు చట్టం సవరణ తేవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ వ్యవసాయ కార్మికుల పనిహక్కును కాలరాస్తుందని, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలమైనయని విమర్శించ్చారు. మహిళలపై రోజు రోజుకు హత్యలు అత్యాచారాలు జరుగుతున్నాయని, మనువాద బ్రహ్మనీయ బావజాలంతో దళితులపై దాడులు, ప్రభుత్వ రంగం ఎప్పుడు ప్రైవేటు పరం అవుతుందో నని ప్రభుత్వఉద్యోగులు, సమస్త రంగాలలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే కార్మిక కర్షక, రైతు వ్యవసాయ కూలీలకు నష్టం కలిగించే చట్టాలను వెనక్కితీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాచకొండ రాములమ్మ, సీఐటీయూ మండల నాయకులు మెంట ఎల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరెళ్ళ నరసింహ,కందుకూరి నర్సింహా, గుండు లక్ష్మి, డప్పు లింగమ్మ, పందుల రాములు, నల్ల అండాలు, కూరేళ్ళ అనూష, అరవింద్, కూరేళ్ళ అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు తేలనున్న అభ్యర్థుల భాగ్యరేఖలు..

## పట్టణంలో తారాస్థాయికి చేరిన రాజకీయ ఉత్కంఠ!



మోత్కూర్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీలో 'పురపోరు' పీఠం ఎవరికి దక్కనుందనే అంశం ఇప్పుడు పట్టణంలో రాజకీయ వేడిని పెంచుతోంది. ఈనెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు భారీ ఎత్తున పోలింగ్‌లో పాల్గొనడంతో, గెలుపుపై అభ్యర్థుల లెక్కలు ఎవరికి వారు వేసుకుంటున్నారు. రేపు (ఫిబ్రవరి 13) వెలువడనున్న ఫలితాలతో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.మున్సిపాలిటీలోని మొత్తం 12వార్డులలో ఈసారి ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. అధికార పార్టీగా పట్టు సాధించాలని కాంగ్రెస్ శ్రేణులు, గత వైభవాన్ని చాటుకోవాలని బీఆర్ఎస్ నాయకులు సర్వశక్తులూ ఒడ్డారు. అయితే, పలు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు మరియు ఇతర పార్టీల అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వడం గమనార్హం. ప్రచార సమయంలో అభ్యర్థులు ఇచ్చిన హామీలు, ముఖ్యంగా మౌలిక వసతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, తాగునీరు మరియు కాలనీల అభివృద్ధి వంటి అంశాలు ఓటర్ల తీర్పుపై ప్రధాన ప్రభావం చూపనున్నాయి.

# ఫతే నగర్ డివిజన్ ప్రజలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. పండాల సతీష్ గౌడ్



కూకట్ పల్లి, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఫతే నగర్ కార్పొరేటర్ గా పదవి కాలం నిన్నటితో ముగిసిన సందర్భంగా డివిజన్ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పండాల సతీష్ గౌడ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ అండ, మీ సహకారం, మీ మద్దత్తు, మీ ప్రేమ లేకపోతే నా సేవలు, మన డివిజన్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమయ్యేవి కావు. మీ విశ్వాసంతోనే ప్రజాసమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు చూపే అవకాశం మీవల్ల నాకు లభించింది అని అన్నారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, రిటర్నింగ్ వాల్ యువతకు జిమ్ లు స్కూళ్ళు బస్తీ దవాఖానలు ఏర్పాటు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడడం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో మీరు నాతో కలిసి నిలబడి, ప్రతి దశలో ప్రోత్సహించారు. ప్రజా ప్రతినిధిగా నా బాధ్యతలను నిజాయితీగా నిర్వహించేందుకు మీ సూచనలు, మీ సలహాలు, మీ సహనం నాకు ఎంతో బలంగా నిలిచాయి అన్నారు. మీ ఆదరణ, మీ ప్రేమ, మీ నమ్మకం – ఇవన్నీ నా జీవితంలో మరచిపోలేని అమూల్య జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి అని ఫతే నగర్ డివిజన్ అభివృద్ధి కోసం మీరు అందించిన సహకారానికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను.అన్నారు భవిష్యత్తులో కూడా మన డివిజన్ మరింత అభివృద్ధి చెందేందుకు, ప్రజల సమస్యల పరిష్కారానికి, సామాజిక సేవలో నేను ఎల్లప్పుడూ మీతో పాటు నిలుస్తాను. పదవి ఉన్నా లేకపోయినా, ఫతే నగర్ డివిజన్ ప్రజల సేవకుడిగా నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది అన్నారు.

# రడం భరత్ జన్మదినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం



గీసుకొండ,12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రడం భరత్ జన్మదినాన్ని పురస్కరించుకుని గీసుకొండ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో సేవా కార్యక్రమం నిర్వహించారు. భరత్ అభిమాని దౌడు అజయ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడే ఈ కార్యక్రమం ద్వారా విద్యపై ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. భరత్ సేవా స్ఫూర్తిని స్ఫూర్తిగా తీసుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. విద్యార్థులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట పిఎస్ పరిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు



కుత్బుల్లాపూర్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాస హిల్స్ కాలనీ లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజా భద్రతలో పోలీసుల పాత్రను వివరించి సైబరాబాద్ కమిషనరేట్ ఏర్పడిన దగ్గర్నుంచి ప్రజా భద్రతలో ఏవిధంగా ముందు వరుసలో ఉందో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరస్వతి శిశు మందిర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటుచేసి యువతను చెడు వ్యసనాలకు ఏ విధంగా దూరంగా ఉండాలో చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది స్కూల్ పిల్లలు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శివ దుర్గా మందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తోటరామారావు



ఖమ్మం, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ఉన్న 47వ డివిజన్ బొక్కలగడ్డ లో, శివ దుర్గా మందిరం 5వ వార్షికోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు మందిరంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేసి ఐదు రోజులు పలు భక్తి పర్వ కార్యక్రమాలను వేలాదిమంది భక్తులతో, ఘనంగా నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా బి ఆర్ ఎస్ నాయకులు తోట రామారావు దంపతులు పాల్గొని, భక్తులతో మమేకమై శివనామ స్వరాన్ని తిలకించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అనేకమంది దాతల సహాయ సహకారాలతో అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ అన్న వితరణ కార్యక్రమానికి తోట రామారావు దంపతులు 20,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావు, అరుణ, కిషోర్, దయాకర్, డింగి రవి, గోపాల్ మరియు భక్తి బృందం తదితరులు పాల్గొన్నారు.

# చింతల్ పద్మశాలి సంఘం మేడారం సమ్మక్క-సారక్క అమ్మవారి దర్శన విజయయాత్ర




కుత్బుల్లాపూర్ , 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): చింతల్ పద్మశాలి సంఘం కమిటీ సభ్యులు మా కుల బంధువులు అందరూ కలిసి పవిత్రమైన మేడారం సమ్మక్క సారక్క అమ్మవారి దర్శన యాత్రను అత్యంత విజయవంతంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకొని, సమ్మక్క-సారక్క అమ్మవారి దివ్య ఆశీర్వాదాలను సంపూర్ణంగా పొందారు. అమ్మవారి సన్నిధిలో గడిపిన ప్రతి క్షణం ఎంతో పవిత్రంగా, ప్రశాంతంగా, ఆనందంగా అనిపించింది. ఈ కార్యక్రమం ద్వారా మా సంఘంలోని సభ్యులందరూ పరస్పరం కలిసిమెలిసి, సంగం ఐక్యత, సహకారం, సోదరభావం మరింత బలపడింది. ప్రతి వ్యక్తి ఈ సమూహ ప్రయాణాన్ని పూర్తిగా ఆస్వాదించి, ఎంతో సంతోషంగా తిరిగి వచ్చారు. ఇది ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే ఈ యాత్రకు సంబంధించిన నిర్ణయం కేవలం 3 రోజుల క్రితమే తీసుకున్నప్పటికీ, అందరి సహకారం సమిష్టి కృషితో ఈ కార్యక్రమం అత్యంత ఘన విజయం సాధించింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన కమిటీ సభ్యులందరికీ, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, అలాగే సహాయ సహకారాలు అందించిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అమ్మవారి ఆశీస్సులతో మా సంఘం ఇంకా మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని కోరుకుంటున్నాము. సమ్మక్క-సారక్క అమ్మవారి దీవెనలు అందరికీ ఉండుగాక! జై సమ్మక్క-సారక్క అమ్మవారు వందనములతో చింతల్ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు పి. సత్యనారాయణ అధ్యక్షులు ఎస్. ఆంజనేయులు, ఖజానాదారు ఎన్. గణేష్, ప్రధాన కార్యదర్శి సంతోష్ జి తదితరులు పాల్గొన్నారు

# కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల వేలం

## దేవస్థానానికి రూ. 9.43 లక్షల ఆదాయం

## - గతేడాదికంటే రూ. 1.96 లక్షలు అధికం



గీసుకొండ, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా దేవస్థానానికి మొత్తం రూ. 9,43,500 ఆదాయం లభించినట్లు ఈఓ పి. ప్రసాద్ తెలిపారు. గతేడాది రూ. 7,47,000తో పోలిస్తే ఈసారి రూ. 1,96,500 అధికంగా రావడం విశేషం అన్నారు. కొబ్బరికాయల అమ్మకం రూ. 6,07,000, కొబ్బరి చిప్పలు రూ. 2,82,000, తలనీలాలు రూ. 31,000, హోటళ్లు, స్టాళ్లు రూ. 23,500 ఆదాయం సమకూరినట్లు వివరించారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా వై రత్నాకర్ రెడ్డి, వెంకటేశ్వర స్వామి దేవస్థానం బట్టల బజార్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసచార్యులు, కాండూరి రామాచార్యులు, విష్ణు, ఫణీంద్ర, పుష్ప కుమార్, ఎన్ వీరస్వామి, అనురాధ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాళం సతీష్ ఆధ్వర్యంలో జరిగిన రాజశ్యామల యాగంలో పాల్గొన్న మంత్రి తుమ్మల



ఖమ్మం, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఖమ్మం నగరంలోని 47వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, నాళం సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన, రాజశ్యామల యాగం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు. పూజల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నగర మేయర్ పునకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యార్లగడ్డ హనుమంతరావు, మార్కెట్ డైరెక్టర్ తల్లాడ రమేష్, డివిజన్ అధ్యక్షులు మరియు ఇతర ప్రముఖులు ప్రారంభించారు. ధ్వజస్తంభం 5వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇవికార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నాళం సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డివిజన్ అధ్యక్షులు షేక్ జాని మియా, లింగు స్వామి, నాగరాజు, గణేశ్, ఉపేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అరవ శ్రీధర్ వ్యవహారంపై బొలిశెట్టి సంచలన వ్యాఖ్యలు.. పవన్ కళ్యాణ్ పరువు తీస్తున్నారు..!



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రైల్వే కోడూరు ఎమ్మెల్యే, జనసేన నేత అరవ శ్రీధర్ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కలకలం రేపింది.. సదరు మహిళ వరుస వీడియోలు విడుదల చేయడంతో సంచలనంగా మారింది.. అయితే, అరవ శ్రీధర్ వ్యవహారంపై స్పందించిన జనసేన సీనియర్ నేత, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేశారు.. కొంతమంది ఎమ్మెల్యేలు పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరువు తీస్తున్నారని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒక్కసారిగా అధికారంలోకి రావడంతో కొందరు దారి తప్పుతున్నారని అభిప్రాయపడ్డారు. అరవ శ్రీధర్ వ్యక్తిగత విషయాలను పార్టీపై రుద్దడం సరైంది కాదని బొలిశెట్టి పేర్కొన్నారు. చిన్న స్థాయి వ్యక్తులను ఎమ్మెల్యేలు చేస్తే, వారు బాధ్యతగా వ్యవహరించాల్సిందిపోయి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే అది పవన్ కల్యాణ్ పరువు తీసినట్టేనని వ్యాఖ్యానించారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పోరాటం చేసి, కష్టపడ్డాం.. జైళ్లకు కూడా వెళ్లి కేసులు ఎదుర్కొని ఎమ్మెల్యేలు అయ్యామని గుర్తుచేశారు బొలిశెట్టి శ్రీనివాస్... కానీ కొంతమంది ఒక్కసారిగా అధికారాన్ని చూసి దారి తప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇక, అసెంబ్లీ సమావేశాలకు రావడానికి మొహం చెల్లడం లేదేమోనని వ్యాఖ్యానించిన ఆయన, ఎక్కడా కూడా అసెంబ్లీకి రావద్దని అరవ శ్రీధర్‌కు చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం మరియు పార్టీ కార్యక్రమాలలో మాత్రమే పాల్గొనవద్దని పార్టీ ఆదేశించిందని వెల్లడించారు జనసేన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.. కాగా, ఈ వ్యాఖ్యలు జనసేన వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# మరో కేసులో అంబటి రాంబాబుకు 14 రోజుల రిమాండ్



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏపీ సీఎం చంద్రబాబును దూషించిన కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు కు మరో కేసులో కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇప్పటికే రెండు కేసుల్లో బెయిల్ పొందిన అంబటికి గుంటూరు ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి కోర్టు గురువారం రిమాండ్ తీర్పునిచ్చారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో అక్రమాలు జరిగాయంటూ ఒకరు కేసు నమోదు చేయడంతో రాజమండ్రి జైలులో ఉన్న అంబటి రాంబాబును పీటీ వారెంట్‌పై గుంటూరుకు తీసుకు వచ్చారు. ఈ కేసును పరిశీలించిన న్యాయమూర్తి వాటిని పరిశీలించి 14 రోజుల పాటు రిమాండ్ తీర్పునివ్వడంతో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

# తిరుమల లడ్డూ కల్తీపై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దేశవ్యాప్తంగా తిరుమల లడ్డూకల్తీ వ్యవహారం సంచలనం కలిగిస్తున్న వేళ సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ గురువారం తిరుమలను సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి జరిగిన విషయాలను ఆయన మీడియాతో పంచుకున్నారు.

తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందనేది వాస్తవమే అయినప్పటికీ, రాజకీయ నాయకులు ఈ అంశంపై రాజకీయం చేయడం మానేసి, దానికి సంబంధించిన దోషులకు కఠినమైన శిక్ష విధించాలని సూచించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు లడ్డూ సమస్యను రాజకీయ లాభం కోసం ఉపయోగించుకుంటూ భక్తులకు మానసిక వేదన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

ఇరు పార్టీల నాయకులు నోరును అదుపులో పెట్టుకోవాలని సూచించారు. బాధ్యతా యుతమైన అధికారులు , మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పై చర్య తీసుకోవాలని, దానిని రాజకీయ వైరంగా మార్చవద్దని తెలిపారు. పవిత్రమైన లడ్డూలను తయారు చేయడానికి ఉపయోగించే నెయ్యిలో కల్తీ వాస్తవమేనని పేర్కొన్నారు.

# ప్రభుత్వ టీచర్‌పై కత్తితో దాడి.. నగల అపహరణ



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఏపీలోని నెల్లూరు జిల్లాలో దారుణం జరిగింది. విధులకు వెళ్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలి పై ఆటో డ్రైవర్ దాడి చేసి ఆభరణాలను దొంగిలించాడు. జిల్లాలోని బాలయపల్లి మండలం గొట్టిగాడి గ్రామం ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ టీచర్ హరిత (35) విధులు నిర్వహిస్తుంది.

రోజు మాదిరిగానే ఆటోలో గురువారం పాఠశాలకు ఆటోలో వెళ్తుండగా గూడూరు గ్రామీణ మండలం కందలి వద్ద ఆటో డ్రైవర్ మార్గమధ్యలో ఆమెపై కత్తితో దాడి చేసి ఆమె మెడలో ఉన్నఆభరణాలను లాక్కొని పారిపోయాడు.స్థానికులు ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అసెంబ్లీ సమావేశాలకు దూరంగా వైసీపీ



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల కు దూరంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేలకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి హాజరుకావొద్దని, శాసనమండలికి యథావిధిగా వెళ్లాలని జగన్ సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో భవిష్యత్తు కార్యచరణపై చర్చించారు

అందుకే హోదా కావాలి

హోదా కోసం ప్రజల సమస్యలపై చర్చించేందుకు ప్రతిపక్ష హోదా కావాలని అడుగుతున్నామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలను ప్రశ్నించకుండా తమ నేతల గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. క్యాష్, రాజేశ్, సూట్ కేస్, లోకేశ్ మాత్రమే రాష్ట్రంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఓ వైపు కూటమి, మరోవైపు వైసీపీ మాత్రమే ఉన్నాయని, అందుకే తాము ప్రతిపక్ష హోదా అడుగుతున్నామని లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేశారు.

# 18 ఏళ్లుగా పరారీలో ఉన్న రౌడీషీటర్ అరెస్ట్



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): విశాఖ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన రౌడీ షీటర్ రెహానుల్లా సిద్ధిక్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 17 నవంబర్ 2002న ఆయనపై రౌడీ షీట్ నమోదు చేయబడింది. రెహానుల్లా సిద్ధిక్‌పై క్రిమినల్ కేసు నంబరు 276/2000 కింద హత్య ఆరోపణలు, అలాగే కేసు నంబరు 290/2002 కింద మహిళపై దాడి, గాయపరచడం, బెదిరింపు ఆరోపణలు నమోదయ్యాయి. హత్య కేసులో శిక్షపడిన అతను అనంతరం ఉన్నత న్యాయస్థానం తీర్పు సవరణతో 2008లో విడుదలయ్యాడు. అప్పటి నుంచి సుమారు 18 ఏళ్లుగా పరారీలో ఉన్నాడు.

ఇటీవల గాండీవం అనువర్తనం ద్వారా ఆయన పాన్ వివరాలు గుర్తించగా, ఆదాయపు పన్ను శాఖ నుంచి అనుబంధ చిరునామా, మొబైల్ వివరాలు సేకరించారు. కాల్ డేటా విశ్లేషణలో అతను చెన్నై ప్రాంతంలో ఉన్నట్లు తేలింది. వెంటనే ప్రత్యేక బృందాన్ని పంపించి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకువచ్చారు. సబ్ ఇన్స్పెక్టర్ సిబ్బందితో కలిసి అతన్ని గురువారం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ కొనసాగిస్తున్నారు. తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# చంద్రబాబును కలిసిన బండ్ల గణేష్.. శ్రీవారి ప్రసాదం అందజేత



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు ను సినీ నిర్మాత బండ్ల గణేష్ కలిశారు. సీఎం చంద్రబాబు కోసం ఆయన 23 రోజుల పాటు 535 కి.మీ మేర తిరుమల పాదయాత్ర చేశారు. షాద్‌నగర్ నుంచి జనవరి 19న బండ్ల గణేష్ పాదయాత్ర కొనసాగించారు. ఫిబ్రవరి 10న తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం తిరిగి వచ్చి చంద్రబాబును కలిశారు. శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా పాదయాత్ర జరిగిన తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుసుకున్నారు. అనంతరం బండ్ల గణేష్‌ను అభినందించారు.

# నగల కోసం బరి తెగించారు..!!



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తిరుపతి జిల్లా బాలయపల్లి మండలం గొట్టికాడు ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న ఉపాధ్యాయురాలు హరితపై ఆగంతకుడు (ఆటో డ్రైవర్) కత్తితో దాడి చేసి నగలు చోరీ చేశారు. ప్రయివేట్ వాహనంలో పాఠశాలకు వెళుతుండగా ఆమెపై ఈ దాడి జరిగింది. ఆమె శరీరంపైనా గొంతులో 7 కత్తిపోట్లున్నట్లు తెలుసుంది. గూడూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో నెల్లూరుకు తరలించారు. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితిలో వున్నారు. ఉపాధ్యాయిరాలిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, నేరగాడిని తక్షణమే అరెస్ట్ చేయాలని గూడూరు యూటీఎఫ్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గూడూరు రూరల్ పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గడ్డాలు, మీసాలు మాకూ ఉన్నాయి అంబటికి బుద్దా వెంకన్న స్ట్రాంగ్ వార్నింగ్



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గడ్డాలు, మీసాలు తమకూ ఉన్నాయని మాజీ మంత్రి అంబటి రాంబాబు కి టీడీపీ నేత బుద్దా వెంకన్న స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. లక్కీ డ్రా పేరుతో మోసం చేసిన కేసులో అంబటిని కోర్టుకు హాజరుపరుస్తున్న నేపథ్యంలో ఆయన 'పుష్ప' సినిమా హీరో స్టైల్లో తగ్గేలే అంటూ వార్నింగ్ ఇచ్చారు. దీంతో అంబటి తీరుపై బుద్దా వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకూ గడ్డాలు, మీసాలున్నాయని, తాము కూడా తగ్గేది లేదని హెచ్చరించారు. సీఎం చంద్రబాబుపై దూషణలు ఆపకపోతే ఊరుకోమన్నారు. అంబటిపై పలు అవినీతి కేసులున్నాయని, కోర్టుకు వెళ్తూ 'పుష్ప'లా స్టంట్ చేయడం దారణమని బుద్దా వెంకన్న మండిపడ్డారు.

అంబటి రాంబాబు ఆధ్వర్యంలో..

కాగా వైసీపీ హయాంలో అప్పటి మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల పేరుతో సత్తెనపల్లి నియోజకవర్గంలో లక్కీ డ్రా నిర్వహించారు. అయితే ఇందులో అంబటి భారీగా అవినీతికి పాల్పడ్డారని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో అంబటిపై కేసు నమోదు అయింది. ఇప్పటికే రెండు కేసులో ఆయన రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్నారు. ఈ రెండు కేసుల్లోనూ ఆయనకు బెయిల్ మంజూరు అయింది. అంతలోనే లక్కీ డ్రా పేరుతో మోసం చేసిన కేసులో ఆయన్ను కోర్టులో హాజరుపర్చేందుకు కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను రాజమండ్రి జైలు నుంచి గుంటూరు కోర్టుకు తీసుకొచ్చే సమయంలో అంబటి తగ్గేదే లే అంటూ పుష్ప స్టైల్ ప్రదర్శించారు. దీంతో అంబటిపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతచచ్చినా పులుపుచావలేదన్న సామెతతో అంబటిపై విమర్శలు కురిపిస్తున్నారు.

# ప్రభుత్వ వైద్యులకు షాకిచ్చిన సర్కార్.. 56 మందికి షోకాజ్ నోటీసులు



ఏపీ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రభుత్వ వైద్యులకు రాష్ట్ర ప్రభుత్వం షాకిచ్చింది. వైద్యారోగ్యశాఖ అనుమతి లేకుండా ఏళ్ల తరబడి విధులకు గైర్హాజరు అవుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. విధుల్లో నుంచి తొలగించాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. చివరి అవకాశంగా 56 మందికి షోకాజు నోటీసులు జారీ చేసింది. ఈనెల 12 లోగా డీఎంఈ ఎదుట హాజరై.. విధులకు గైర్హాజరు అవ్వడానికి గల కారణాలను లిఖితపూర్వకంగా వివరించాలని, లేదంటే తొలగిస్తామని డీఎంఈ రఘునందన్ నోటీసుల్లో పేర్కొన్నారు. షోకాజు నోటీసులు అందుకున్న వారిలో 9మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 45 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు.

# కార్మిక-రైతు వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

## వరంగల్‌లో ఆల్‌ట్రేడ్ యూనియన్స్ భారీ ర్యాలీ

వరంగల్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక--రైతు వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సిఐటియు, ఏఐసిటియు, బిఆర్టియు, ఎస్కేఎం తదితర కార్మిక, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ సహా పలువురు నాయకులు హాజరై కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. నాయకులు మాట్లాడుతూ, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడం ద్వారా కార్మిక హక్కులను కాలరాస్తున్నారని, 12 గంటల పనిని చట్టబద్ధం చేయడం, సామాజిక భద్రత నిధులను తగ్గించడం, కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్యానికి ముప్పని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు గ్రామీణ పేదల జీవనోపాధిపై దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల రక్తంతో సాధించిన హక్కులను కార్పొరేట్‌ల కోసం తాకట్టు పెట్టే లేబర్ కోడ్స్‌ను మేమెప్పటికీ అంగీకరించము. హక్కుల కోసం పోరాటం ఆగదు, అవసరమైతే దేశవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలకు సిద్ధం,




కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, లేదంటే దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, ఎంసిపిఐయు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ తదితర సంఘాల జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

సూర్యాపేట, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గురువారం రోజున మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంభందించి, జిల్లా కేంద్రంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాట్లను, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ లు ఓట్ల లెక్కింపు గదుల ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ ల భద్రత పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి సిబ్బందికి, సూచనలు సలహాలు అందించారు. ఎక్కడ కూడా లోపలి తలెత్తకుండా సమస్యలు రాకుండా పటిష్టంగా ఏర్పాట్లు, చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారుల ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులో ఉన్న అభ్యర్థులను ఏజెంట్లను మాత్రమే, కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించబడుతుందని, కలెక్టర్ తెలిపారు. లెక్కింపు గదులలో అభ్యర్థులు ఏజెంట్లు క్రమశిక్షణ పాటించాలని అధికారుల సూచనలు పాటించాలని కోరారు. సూర్యాపేట, కోదాడ, హుజుర్నగర్, మున్సిపాలిటీ కేంద్రాలకు మూడు చొప్పున లెక్కింపు గదులు, తిరుమలగిరి నేరేడుచర్ల మున్సిపాలిటీలకు రెండు చొప్పున లెక్కింపు గదులు మొత్తం 13 లెక్కింపు ప్రజలను కేటాయించడం జరిగిందని, ఆయా గదులలో వార్డులు, బ్యాలెట్ల ఆధారంగా లెక్కింపు టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఓట్ల లెక్కింపులో సమర్థవంతంగా విధులు నిర్వహించే సిబ్బందిని కేటాయించాం అన్నారు. లెక్కింపు గదులలో పూర్తి భద్రతతో బారికేడింగ్ చేసి సీసీటీవీ నిఘా ఏర్పాటు చేశాం అన్నారు. లెక్కింపు కేంద్రాలలోకి ఎవరు కూడా సిరా సీసా, వాటర్ బాటిల్స్ మంటను ప్రేమించే వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదు అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, లెక్కింపు కేంద్రం వద్ద ఐదు అంచెల పోలీసు భద్రతను



ఏర్పాటు చేశామని కళాశాల ప్రాంగణమంతా పోలీసు,భద్రతలో ఉందని తెలిపారు. లెక్కింపు గింజలు నిర్వర్తించే సిబ్బంది, లెక్కింపుకు వచ్చే అభ్యర్థులు ఏజెంట్లు అధికారులు, వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వాహనాలు పునరుద్ధరించడానికి ప్రణాళిక ప్రకారం పని చేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు బ్యాలెట్ బాక్స్ స్ట్రాంగ్ రూమ్ లో వద్ద హాయిగా పోలీసులతో సహారా నిర్వహిస్తున్నామని తెలిపారు. లెక్కింపు గదులు పూర్తి భద్రతలో ఉన్నాయని సీసీ కెమెరాలు అన్ని గా ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమం నందు స్థానిక ఆర్డిఓ వేణుమాధవ్, డి.ఎస్.పి ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎమ్మార్వో కృష్ణయ్య, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## "ది పార్కు అరేబియన్ మండి" రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్ పల్లి, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కెపిహెచ్బి రోడ్ నెంబర్ 6 మెయిన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన "ది పార్క్ అరేబియన్ మండి" రెస్టారెంట్ ను కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరావు కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక డివిజన్ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా రెస్టారెంట్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలుపుతూ మీరు ఏర్పాటు చేసుకున్న ఈ రెస్టారెంట్ ద్వారా కస్టమర్లకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందజేస్తూ వారి అభిమానాన్ని పొందాలన్నారు రెస్టారెంట్ యాజమాన్యం మాట్లాడుతూ మా రెస్టారెంట్ పేరులోనే "ది పార్క్" అనే పదం ఉందని దానికి తగ్గట్టుగా చిన్న పిల్లలను యువతను ఆకట్టు కొనే విధంగా రెస్టారెంట్ డిజైన్ చేయబడిందన్నారు అలాగే మా వద్ద అన్ని రకాల ఐటమ్స్ కూడా ఎంతో రుచికరంగా ఉంటాయని క్వాలిటీ క్వాంటిటీ విషయంలో ఎక్కడా రాజి పడకుండా నిష్ణాతులైన వంట మాస్టర్ లతో ప్రతి ఐటమ్ తయారు చేయబడుతుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు మా రెస్టారెంట్ ను సందర్శించి మా వంటకాలను రుచి చూడవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ యాజమాన్య కుటుంబ సభ్యులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ జన్మదిన వేడుకలు




కూకట్ పల్లి, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కూకట్పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ జన్మదిన వేడుకలు కేపీహెచ్బీ లోని జనసేన కార్యాలయంలో ఘనంగా జరిగాయి ఈ వేడుకలకు పెద్ద ఎత్తున జన సైనికులు. వీర మహిళలు. ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ అభిమానులు హాజరై ఆయనకు శాల్వాలు కప్పి. కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన తరపున 336 మంది అభ్యర్థులు పోటీ చేశారని వారందరి గెలుపు కొరకు జనసైనికులు వీర మహిళలు. ప్రతి డివిజన్లో కష్టపడి పని చేశారన్నారు. అలాగే రానున్న రోజుల్లో సైబరాబాద్ కార్పొరేషన్. జిహెచ్ఎంసి. మల్కాజిగిరి కార్పొరేషన్ ఎన్నికలలో కూడా జనసేన పోటీ చేసి సత్తా చాటపోతుందన్నారు. అలాగే నా పుట్టినరోజు సందర్భంగా నాకు ప్రత్యక్షంగానూ. పరోక్షంగానూ. మీడియా మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ తెలియజేశారు. ఈ వేడుకలలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఎన్.హెచ్.ఎం ఉద్యోగులకు వేతనాలు విడుదల చేయాలని డిఎం అండ్ హెచ్ఓ కు వినతిపత్రం అందజేసిన రామ రాజేష్ ఖన్నా




హనుమకొండ, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగులందరూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముందట ధర్నాలో పాల్గొనడం జరిగింది.హనుమకొండ డి.ఎం అండ్ హెచ్.ఓ.డాక్టర్ అల్లం అప్పయ్య కు కలెక్టరేట్లో ఉద్యోగుల సమస్యలతో కూడినలేఖను అందజేశారు.జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన,వాయిదాపడి ఉన్న మూడునెలల వేతనాలు నవంబర్,డిసెంబర్,జనవరి వేతనాలు వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయాలని,కనీస వేతనం ఇరవైఆరు వేలరూపాయలు ఇవ్వాలని,ఈ.ఎస్.ఐ.,పీ.ఎఫ్. సౌకర్యాలు కల్పించేలా చూడాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో ఎన.హెచ్ ఎం.ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగులు సుమారు యాభై మంది పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో జాతీయ ఆరోగ్యమిషన్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ఉద్యోగులు యూనియన్ ఏఐటియుసి అనుబంధం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగులు, దాడి.మాధవరావు,అజ్మీర విజయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన కోలన్ హన్మంత్ రెడ్డి





కుత్బుల్లాపూర్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి బాల్ రెడ్డి , సొమ్మన్నగారి శ్రీధర్ రెడ్డి, పుట్టినరోజు వేడుకలు బౌరంపేట్ జన్నురం లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, హాజరై, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బెంబడి మల్ల రెడ్డి,బొంగునూరి కిషోర్ రెడ్డి,కావాలి గణేష్,మైసిగారి శ్రీనివాస్,సిద్దనోల సంజీవరెడ్డి, నాగిరెడ్డి,నగేష్ రెడ్డి,ఆకుల హరికిరణ్, సల్మాన్ రాజ్ , రాజు గౌడ్ , రాజు చారి , కరన్ , చందు ,నర్సింహా రెడ్డి, నాగేంద్ర, హరి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బాధలో భరోసా విషాదంలో ధైర్యం



గీసుకొండ,12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గీసుగొండ గ్రామానికి చెందిన శ్రీ రామోజు సుజాత, సరోజన మృతిచెందిన విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన అల్లం బాలకిషోర్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి తన సానుభూతి తెలిపారు. ప్రజల బాధలను తన బాధలుగా భావిస్తూ కష్టకాలంలో అండగా నిలిచిన ఆయన మానవీయ స్పందన గ్రామ ప్రజలను హత్తుకుంది. జిల్లా నాయకులు వీరగోని రాజకుమార్, అల్లం మర్రెడ్డి కుటుంబాలను పరామర్శించి అల్లం బాలకిషోర్ రెడ్డి తరపున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనుగొండ వార్డు మెంబర్లు తుప్పరి ఉదయ్, గీసుగొండ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్, మాజీ సర్పంచులు దౌడు బాబు, కోలా కుమార్ స్వామి, ఉపసర్పంచ్ కోట ప్రమోద్ తదితరులు పాల్గొని కుటుంబాలకు ధైర్యం చెప్పారు.

## జీడిమెట్ల,గాంధీనగర్ పారిశ్రామిక వాడల్లో సమ్మె విజయవంతం


### కార్మిక సంఘం నాయకుల, కార్మికుల ప్రదర్శన




కుత్బుల్లాపూర్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బీజేపీ తెచ్చిన నూతన లేబర్ కోడ్ లను రద్దు చెయ్యాలని దేశవ్యాప్తంగా జాతీయ కార్మికులు సంఘాల పిలుపు మేరకు జీడిమెట్ల,గాంధీ నగర్ పరిశ్రమిక వాడల్లో పరిశ్రమల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ ఇవ్వడం వల్ల కార్మికులు సమ్మె లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చెయ్యడం జరిగింది. షాపూర్ నగర్ లో జరిగిన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి నాయకత్వం వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిఐటియు నాయకులు అంజయ్య, టి యుసిఐ నాయకులు ప్రవీణ్, ఏ ఐ ఎఫ్ టి యు నాయకులు పద్మ, ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అందులో భాగంగానే నూతన లేబర్ కోడ్లను తీసుకొని వచ్చి 100 సంవత్సరాల క్రితం సాధించుకున్నటువంటి ఎనిమిది గంటల పని దినం ఉద్యోగ భద్రత యూనియన్ల ఏర్పాటు జీతభత్యాల కొరకు సంప్రదింపులు లాంటి అనేక చట్టాలను నిర్వీర్యం చేసి కంపెనీ యాజమాన్యాలకు అధికారమిచ్చి కార్మికులకు తీవ్రమైన అన్యాయానికి గురై చేస్తున్నారని, కార్పొరేట్ పెట్టుబడిదారులకు లక్షల వారికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా 30 కోట్ల మంది అసంఘటిత కార్మికులు పాల్గొంటున్నారని ఇది మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక లాంటిదని వెంటనే నూతన లేబర్ కోడ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు జీడిమెట్ల లోని అనేక పారిశ్రామిక ప్రాంతాలకు తిరిగి కార్మికులను బందులో పాల్గొనేలా చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహారెడ్డి, బక్కరి మల్లేష్, గుర్రప్ప, కే శ్రీనివాస్, పి శ్రీనివాస్, రమేష్,భీమేష్, మహేందర్,యాగంటి, మజ్జి గౌరీ, సిఐటియు నాయకురాలు స్వాతి, ఆంజనేయులు టి సి ఐ నాయకులు రాంబాబు తో పాటు వందలాదిమంది కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# ట్యాబ్లెట్లను వాడుతున్నా కూడా.. థైరాయిడ్ అదుపులోకి రావడం లేదంటే కారణాలు ఇవే..!

హెల్త్ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రస్తుతకాలంలో మనలో చాలా మందిని వేధిస్తున్న అనారోగ్య సమస్యల్లో థైరాయిడ్ ఒకటి. ప్రతి పది మందిలో ఒకరు హైపోథైరాయిడిజంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సమస్యతో ఎక్కువగా ఇబ్బందిపడుతున్నారు. థైరాయిడ్ సమస్యను నియంత్రణలో ఉంచుకోవడానికి రోజూ కొన్ని లక్షల మంది థైరాయిడ్ ట్యాబ్లెట్లను వేసుకుంటున్నారని చెప్పవచ్చు. అయితే మనలో చాలా మంది థైరాయిడ్ ట్యాబ్లెట్లను వేసుకుంటున్నప్పటికీ దాని ఫలితాలు సరిగ్గా లేవని, ట్యాబ్లెట్లను వేసుకున్నప్పటికీ బరువు పెరగడం, అలసట, శక్తి లేకపోవడం, జుట్టు రాలడం, పొడి చర్మం వంటి సమస్యలతో బాధపడుతూనే ఉన్నామని చెబుతుంటారు. ట్యాబ్లెట్లను వేసుకున్నప్పటికీ సమస్యలతో ఎందుకు బాధపడుతున్నారు.. అలాగే థైరాయిడ్ గ్రంథి పనితీరు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



కీలక విధుల నిర్వహణ..

మన శరీరంలో ముఖ్యమైన గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. గొంతు కింద భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఈ గ్రంథి ఉంటుంది. శరీరంలో శక్తి ఉత్పత్తి, వినియోగం, నిల్వలను నియంత్రించే కీలక విధులను ఈ గ్రంథి నిర్వర్తిస్తుంది. మెదడులోని పిట్యూటరీ గ్రంథి థైరాయిడ్ గ్రంథి కార్యకలపాలను నియంత్రిస్తుంది. థైరాయిడ్ గ్రంథి థైరాక్సిన్ టి-4 ( రక్తంలో ఎక్కువగా ఉండే హార్మోన్) , ట్రైయోడోథైరానిన్ టి-3 ( కణ స్థాయిలో పనిచేసే క్రియాశీల హార్మోన్)ను ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్ల స్థాయిలను బట్టే థైరాయిడ్ నిర్ధారణ, చికిత్స జరుగుతుంది. థైరాయిడ్ హార్మోన్లు తగినంత ఉత్పత్తి కాకపోవడం వల్ల హైపోథైరాయిడిజం సమస్య వస్తుంది. అలసట, బరువు పెరగడం, చలిని తట్టుకోలేకపోవడం దీని లక్షణాలు. అయోడిన్ లోపం, థైరాయిడ్ గ్రంథి తొలగింపు, పిట్యూటరీ గ్రంథి లోపాలు, హషిమోటో అనే వ్యాధి కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది.

మైటోకాండ్రియా పనితీరు కీలకం..

ఇక థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అవ్వడం వల్ల హైపర్ థైరాయిడిజం వస్తుంది. గ్రేవ్స్ వ్యాధి కారణంగా ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఆందోళన, వేడిని తట్టుకోలేకపోవడం, బరువు తగ్గడం, గుండెదడ వంటి లక్షణాలు ఈ సమస్యలో కనిపిస్తాయి. సరైన మందులు ఉన్నప్పటికీ చాలా మందిలో అలసట, బరువు నియంత్రణలో లేకపోవడం, మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. థైరాయిడ్ హార్మోన్ల తయారీ మైటోకాండ్రియా ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. మైటోకాండ్రియా అనేవి కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే నిర్మాణాలు. ఇవి పోషకాలను శక్తిగా మార్చి శరీరంలో అన్ని అవయవాలకు శక్తిని అందిస్తాయి. మైటోకాండ్రియా ఆరోగ్యం బాగుంటేనే థైరాయిడ్ హార్మోన్లు సరిగా తయారవుతాయి. మైటోకాండ్రియా శక్తి ఉత్పత్తి తగ్గితే హార్మోన్లు ఉన్నా వాటి ప్రభావం తగ్గుతుంది.

ఇలా చేయాలి..

థైరాయిడ్ హార్మోన్లు సరిగ్గా ఉన్నా కణాల శక్తి బలహీనంగా ఉంటే జీవక్రియ సరిగ్గా జరగదు. కనుక మందులు వాడినప్పటికీ సమస్యలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ సమస్యను హార్మోన్ల సమస్యగా కాకుండా కణశక్తి సమస్యగా చూడాలని వారు చెబుతునన్నారు. కణశక్తి స్థాయినిపెంచడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఐరన్, విటమిన్ బి, మెగ్నీషియం లోపాలు లేకుండా చూసుకోవాలి. నిద్రలేమి, ఒత్తిడి వంటి సమస్యలు రాకుండా చూసుకోవాలి. కండర వ్యాయామాలు చేయాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. ట్యాబ్లెట్లను తీసుకోవడంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల థైరాయిడ్ వల్ల వచ్చే ఇతర అనారోగ్య సమస్యలు కూడా తగ్గుతాయని వైద్యులు తెలియజేస్తున్నారు.

# డయాబెటిస్ వచ్చేందుకు చాలా ఏళ్ల ముందే ఈ లక్షణాలు కనిపిస్తాయి..!

హెల్త్ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): । మన ఆరోగ్యంలో చిన్న చిన్న మార్పులు జరుగుతున్నప్పటికీ వాటిని మనం అంతగా పట్టించుకోం. కానీఈ మార్పులే కొన్నిసార్లు తీవ్ర అనారోగ్యాన్ని సూచిస్తాయి. లక్షణాలు కనబడకుండా చిన్న చిన్న మార్పులతో వచ్చే అనారోగ్య సమస్యల్లో డయాబెటిస్ ఒకటి. ఈ వ్యాధి చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. శక్తి స్థాయిలు తగ్గడం, నరాలు, చూపు, రోగనిరోధక శక్తిపై మొదటగా ప్రభావాన్ని చూపిస్తుంది. కానీ ఈ లక్షణాలను ఎవరూ పట్టించుకోరు. నిజానికి డయాబెటిస్ వచ్చే ముందు నుండే శరీరం మెటాబాలిక్ ఒత్తిడిని సూచించడం మొదలుపెడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం టైప్ 2 డయాబెటిస్ వచ్చే 13 సంవత్సరాల ముందు నుండే శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరగడం మొదలవుతుంది. అలాగే చిన్న వయసులో రోగనిరోధక శక్తిలో వచ్చే మార్పులు టైప్ 1 డయాబెటిస్ ను సూచిస్తాయి. డయాబెటిస్ బారిన పడే ముందు మన శరీరంలో రోజువారి ఆరోగ్యంలో వచ్చే చిన్న చిన్న మార్పుల గురించి తెలుసుకుందాం.




శరీరం భారంగా అనిపించడం..

డయాబెటిస్ నిర్ధారణకు ముందే గుండెపై ఒత్తిడి మొదలవుతుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, విశ్రాంతి తీసుకున్నప్పటికీ అలసటగా ఉండడం, మెట్లు ఎక్కేటప్పుడు శరీరం భారంగా అనిపించడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. చాలా మంది వీటిని పని ఒత్తిడి, వయసు పైబడడం వల్ల ఇలా జరుగుతుందని భావిస్తారు. అలాగే మెటబాలిక్ అసమతుల్యత కారణంగా నరాలలో, చర్మంలో మార్పులు వస్తాయి. పాదాలు, వేళ్లల్లో మంట, తిమ్మిర్లు రావడం, మెడ, చంకలు వంటి భాగాల్లో చర్మం నల్లగా మారడం, చర్మం పొడిగా, దురదగా ఉండడం వంటివి జరుగుతాయి. ఇవన్నీ కూడా చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతాయి. కనుక వీటిని ఎవరూ అంతగా పట్టించుకోరు. తద్వారా డయాబెటిస్ తీవ్రత పెరుగుతుంది.

రోగ నిరోధక శక్తి తగ్గడం..

రక్తంలో గ్లూకోజ్ నియంత్రణ సరిగ్గా లేకపోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. తెల్లరక్తకణాల పనితీరు దెబ్బతింటుంది. దీంతో తరచూ యూరిన్ ఇన్ఫెక్షన్ లు రావడం, దంతాలు, చిగుళ్ల ఇన్ఫెక్షన్ లు రావడం, తరచూ ఫంగల్ ఇన్ఫెక్షన్ లు రావడం, చిన్న ఇన్ఫెక్షన్ లు కూడా ఆలస్యంగా తగ్గడం వంటివి జరుగుతాయి. ఇక గ్లూకోజ్ లో వచ్చే మార్పులు కంటిచూపుపై కూడా ప్రభావాన్ని చూపిస్తాయి. కళ్లు మసకగా కనిపించడం, చూపులో మార్పు రావడం వంటివి జరుగుతాయి. స్క్రీన్ ఎక్కువగా చూడడం వల్ల ఇలా జరుగుతుందని అనుకుంటారు. కానీ శరీరంలో మెటబాలిక్ అసమతుల్యతల వల్ల కూడా ఇలా జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. కనుక శరీరంలో కనిపించే ఈ మార్పులను గుర్తించడం చాలా అవసరం. లక్షణాలు మరీ ఎక్కువగా ఉంటే వైద్యుడిని సంప్రదించి ఫాస్టింగ్ గ్లూకోజ్, HbA1c వంటి రక్తపరీక్షలు చేయించుకోవాలి. జన్యుపరంగా డయాబెటిస్ వచ్చే అవకాశం ఉన్న వారు ఈ లక్షణాలను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. డయాబెటిస్ ప్రారంభ దశలో ఉన్నప్పుడే గుర్తించడం వల్ల చికిత్స, జీవనశైలిలో మార్పుల కారణంగా వ్యాధి తీవ్రత పెరగకుండా ఉంటుందని వైద్యులు సలహా ఇస్తున్నారు.



# క్రీడలు





## నమీబియాతో మ్యాచ్.. అభిషేక్ స్థానంలో కొత్త ప్లేయర్?



స్పోర్ట్స్ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో మరో కీలక మ్యాచ్ కోసం భారత జట్టు సిద్ధమైంది. ఇప్పటికే అమెరికా పై విజయం సాధించిన ఇండియా, ఇప్పుడు మరో పసికూన నమీబియాతో తలపడనుంది. భారత్, నమీబియా జట్ల మధ్య ఇవాళ సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ఉండనుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఈ రెండు జట్లు తలపడతాయి. ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్న రెండు జట్లు, ప్రాక్టీస్ లో నిమగ్నం అయ్యాయి. అయితే ఇలాంటి నేపథ్యంలో ఇండియాకు ఊహించని షాక్ తగిలింది.

అభిషేక్ శర్మ లేకుండానే భారత్ ?

అమెరికా పై గెలిచిన భారత జట్టుకు స్టార్ ఆటగాడు అభిషేక్ శర్మ దూరమయ్యాడు. అతనికి తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం ఉన్న సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఆస్పత్రిలో అభిషేక్ శర్మ ఉన్నట్లు చెబుతున్నారు. ఇవాళ లేదా రేపు అభిషేక్ శర్మ డిశ్చార్జ్ అయ్యే ఛాన్స్ లు ఉన్నాయి. అయితే అభిషేక్ శర్మ భారత జట్టుకు దూరమైన నేపథ్యంలో, సంజు శాంసన్ కు బంపర్ ఆఫర్ తగిలింది. అతన్ని ఇవాల్టి మ్యాచ్ లో సూర్య కుమార్ యాదవ్ తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

సంజు శాంసన్ ఓపెనర్ గానే కాకుండా వికెట్ కీపర్ గా కూడా పనికి వస్తాడు. రైట్ హ్యాండ్ బ్యాటర్ కావడంతో భారత జట్టుకు మంచి హెల్ప్ కానుంది. కానీ అతని ఫామ్ మాత్రం ఇబ్బంది పెడుతోంది. న్యూజిలాండ్ సిరీస్ లో అత్యంత దారుణంగా సంజు శాంసన్ విఫలమయ్యాడు. అయితే పసికూన నమీబియాపై మాత్రం సంజు రెచ్చిపోతే మంచి అవకాశాలు రానున్నాయి. అటు భారత ఫాస్ట్ బౌలర్ బుమ్రాకు ఇవాల్టి మ్యాచ్ లో కూడా రెస్ట్ ఇస్తారని అంటున్నారు. సిరాజ్, అర్షదీప్ నే వాడుకోనున్నారు. పాకిస్తాన్ తో జరిగే మ్యాచ్ లో మాత్రం బుమ్రా ఆడే ఛాన్స్ ఉంది.

## అంపైర్ నిర్ణయంపై నిరసన.. సీనియర్ ఆల్‌రౌండర్‌కు భారీ జరిమానా..!



స్పోర్ట్స్ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): పొట్టి ప్రపంచకప్‌లో బోణీ కోసం నిరీక్షిస్తున్న అఫ్గనిస్థాన్‌కు మరో షాక్. బుధవారం దక్షిణాఫ్రికా చేతిలో దురదృష్టవశాత్తూ రెండో సూపర్ ఓవర్లో కంగుతిన్న కాబూలీ టీమ్‌ను మరింత బాధకు గురి చేస్తూ.. మొహమ్మద్ నబీ కి ఐసీసీ భారీ జరిమానా విధించింది. ఐసీసీ నియమావళిని ఉల్లంఘించినందుకు ఈ సీనియర్ ఆల్‌రౌండర్ మ్యాచ్ ఫీజులో పెద్ద మొత్తాన్నే కోల్పోనున్నాడు. దక్షిణాఫ్రికాపై రెండో సూపర్ ఓవర్‌తో ఫలితం తేలిన మ్యాచ్‌లో నబీ అంపైర్ నిర్ణయం పట్ల నిరసన తెలిపడమే అందుకు కారణం.

అసలే వరుస ఓటములతో డీలా పడిన అఫ్గనిస్థాన్‌కు ఐసీసీ బిగ్ షాకిచ్చింది. అంపైర్ నిర్ణయంపై అసంతృప్తి వెళ్లగక్కినందుకు మొహమ్మద్ నబీపై జరిమానా విధించింది. బుధవారం సఫారీలతో మ్యాచ్ 14వ ఓవర్లో అంపైర్‌తో నబీ తీవ్రంగా గొడవ పడ్డాడు. పేసర్ ఎంగిడి చేతి బ్యాండ్ పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిన ఈ సీనియర్ ఆల్‌రౌండర్ మీరు అతడిని ఎలా అనుమితించారు అంటూ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు.

నబీ తీరుపై రిఫరీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేయగా.. అతడు లెవల్ 1 తప్పిదానికి పాల్పడినట్టు గుర్తించారు. ఇదే విషయం అఫ్గన్ స్టార్ తన పొరపాటును అంగీకరించాడు. నబీ సారీతో సంతృప్తి చెందిన రిఫరీ ప్యానెల్ అధ్యక్షుడు డేవిడ్ గిల్బర్ట్ .. నబీకి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించారు. అంతేకాదు ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించారు.

గుర్బాజ్ పోరాడినా..

గత సీజన్‌లో సెమీఫైనల్ ఆడిన అఫ్గనిస్థాన్ ఈసారి బోణీ కొట్టలేకపోయింది. తొలిపోరులో న్యూజిలాండ్ ధాటికి కంగుతిన్న కాబూలీ టీమ్.. రెండో మ్యాచ్‌లో మాత్రం దక్షిణాఫ్రికాను వణికించింది. 187 పరుగుల ఛేదనలో రహ్మనుల్లా గుర్బాజ్(0) మెరుపులతో స్కోర్ సమం చేసింది. అనంతరం సూపర్ ఓవర్లోనూ ఇరుజట్లు సమంగా నిలువగా.. రెండో సూపర్ ఓవర్‌తో ఫలితం తేలింది. గుర్బాజ్ వరుసగా మూడు సిక్సర్లతో జట్టును గెలిపించినంత పనిచేశాడు. కానీ, చివరి బంతికి అదు ఔటవ్వగా.. అఫ్గనిస్థాన్ ఓటమిపాలైంది. రెండు ఓటములతో రషీద్ ఖాన్ బృందం సూపర్-8 అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.

## టీ20 వరల్డ్ కప్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ ఎలిమినేట్? పాకిస్తాన్ లో సంబరాలు




స్పోర్ట్స్ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 వరల్డ్ కప్ లో ఆఫ్ఘనిస్తాన్ కథ దాదాపు ముగిసినట్లేనని తెలుస్తోంది. ఈ వరల్డ్ కప్ టోర్నమెంట్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ ఎలిమినేట్ అయినట్లేనని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ టోర్నమెంట్ లో ఇప్పటి వరకు ఆఫ్ఘనిస్తాన్ రెండు మ్యాచ్ లు ఆడితే, రెండింటిలో కూడా ఓడిపోయింది. దీంతో ఒక్క పాయింట్ కూడా సాధించని ఆఫ్ఘనిస్తాన్, మైనస్ రన్ రేట్ తో డీలా పడిపోయింది. అయితే టీ20 వరల్డ్ కప్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ ఎలిమినేట్ అయిందన్న వార్తలు బయటకు రావడంతో పాకిస్తాన్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారట. అటు లాహోర్ వీధుల్లో టపాకాయలు పేల్చి మరి ఎగిరి గంతేస్తున్నారట పాక్ ఫ్యాన్స్.


పాకిస్తాన్ కు రషీద్ ఖాన్ స్ట్రాంగ్ కౌంటర్

ఆఫ్ఘనిస్తాన్ పట్ల పాకిస్తాన్ అభిమానులు రెచ్చిపోయి ప్రవర్తిస్తున్న నేపథ్యంలో రషీద్ ఖాన్ రియాక్ట్ అయ్యాడు. కొంత మంది తమ ఓటమిని చూసి సంబరాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు రషీద్ ఖాన్. దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ మధ్య నిన్న మ్యాచ్ జరిగిన తర్వాత రషీద్ ఖాన్ ప్రెస్ మీట్ పెట్టారు. దక్షిణాఫ్రికా పైన పోరాడి ఓడినట్లు గుర్తు చేశారు రషీద్ ఖాన్. కాస్త కష్టపడి ఉంటే మ్యాచ్ గెలిచే వాళ్ళమని తెలిపారు. అదే సమయంలో పాకిస్తాన్ అభిమానులకు కౌంటర్ ఇచ్చారు. కొంత మంది పాకిస్తాన్ అభిమానులు తమను తక్కువ అంచనా వేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు.

అలాగే తమ జట్టు ఎలిమినేట్ అయిందన్న వార్తను వైరల్ చేసి, శునకా నందం పొందుతున్నారని నిప్పులు చెరిగారు. నమీబియా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా లాంటి జట్లు ఉన్న గ్రూప్ లో ఆఫ్ఘనిస్తాన్ ఉంటే సూపర్ 8కు సులభంగా దూసుకు వెళ్లేదని తెలిపారు. కానీ తమ జట్టు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా లాంటి బలమైన టీమ్స్ తో పోరాడుతున్నట్లు పాకిస్తాన్ కు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు రషీద్ ఖాన్. పాకిస్తాన్ ప్రస్తుతం ఉన్న గ్రూపులో ఇండియా ఒక్కటే బలమైన జట్టు అంటూ పరోక్షంగా చురకలు అంటించారు. మాలాగా బడా జట్లతో ఆడి గెలిచి చూపించాలని పాకిస్తాక్ కౌంటర్ ఇచ్చారు.

రెండు సంవత్సరాల కిందట జరిగిన టీ20 ప్రపంచ కప్ లో ఇండియా లాంటి బలమైన జట్లతో సెమీ ఫైనల్ ఆడేదాకా వెళ్ళామని గుర్తు చేశారు. ఇది ఇలా ఉండగా, గ్రూప్ డి లో ఉన్న ఆఫ్ఘనిస్తాన్, తాజాగా దక్షిణాఫ్రికా తో తలపడింది. ఈ మ్యాచ్ చాలా ఉత్కంఠ భరితంగా సాగిన సంగతి తెలిసిందే. రెండు సార్లు సూపర్ ఓవర్లు ఆడాయి ఇరు జట్లు. కానీ చివరికి దక్షిణాఫ్రికా అద్భుతంగా రాణించి విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా 187 పరుగులు చేస్తే... ఆఫ్ఘనిస్తాన్ కూడా అంతే పరుగులు సాధించి సూపర్ ఓవర్ కు దారితీసింది. సూపర్ ఓవర్ లో దక్షిణాఫ్రికా గెలిచేసింది.

## కంగారూల వేట షురూ.. ఐర్లాండ్‌పై భారీ గెలుపు



స్పోర్ట్స్ న్యూస్, 12 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ వేటను ఆస్ట్రేలియా ఘన విజయంతో ఆరంభించింది. కొలంబో వేదికగా పూర్తి ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో కంగారూలు.. 67 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచేశారు. బ్యాటింగ్‌లో భారీ స్కోర్లేమీ నమోదుకాకపోయినా మార్కస్ స్టోయినిస్ (29 బంతుల్లో 45, 2 ఫోర్లు, 1 సిక్స్), జోష్ ఇంగ్లిస్ (17 బంతుల్లో 37, 6 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది.

ఛేదనలో ఐర్లాండ్.. ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ (4/12), ఆడమ్ జంపా (4/23) ధాటికి 16.5 ఓవర్లలో 115 రన్స్‌కే చేతులెత్తేసింది. ఆ జట్టులో డాకరెల్ (29 బంతుల్లో 41, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు. ఈ మ్యాచ్‌కు ముందు ఆసీస్ సారథి మిచెల్ మార్ష్ గాయంతో దూరమవడంతో ఈ మ్యాచ్‌కు ట్రావిస్ హెడ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

KR TV క్రాంతి
శుక్రవారం 13 ఫిబ్రవరి 2026

# సినిమా న్యూస్

epaper.krtvnews.com

## 'హిట్' సెవెంత్ కేస్ వరకు ఉంటుంది

### డైరెక్టర్ శైలేష్ కొలను ఇంట్రెస్టింగ్ కామెంట్స్




టాలీవుడ్ ఇండస్ట్రీలో హిట్ కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న డైరెక్టర్ శైలేష్ కొలను మనందరికీ సుపరిచితమే. హిట్ వంటి సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలతో పాటు 'సైంధవ్' సినిమాకు కూడా దర్శకత్వం వహించారు. అయితే రీసెంట్‌గా వచ్చిన హిట్-3 మూవీ మంచి విజయం సాధించింది. నాని హీరోగా నటించిన ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది.వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించాడు.

అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. 'ప్రజెంట్ నేను హిట్ కేస్ 4 పై కథ రాస్తున్నా.. అయితే నాకు హిట్ సెవెంత్ కేస్ వరకు ఐడియాస్ ఉన్నాయి. అయితే సెవెంత్ కేస్‌లో ఇప్పటివరకు నటించిన అందరూ ఆఫీసర్స్ వచ్చి ఎవెంజర్స్‌లా ఒక స్పేస్‌కి తీసుకు వెళదామన్నది ఇక ఐడియా ఉంది. సిక్స్ వరకు డిఫరెంట్ డిఫరెంట్ ఐడియాస్ ఉన్నాయి. కేస్ 4 వరకు కొత్త కొత్త హీరోలు ఉంటారు. అయితే చాలా మంది కేస్ 4లో హీరో కార్తీ అని చాలా వార్తలు వస్తున్నాయి.. నేను దాని గురించి ఇప్పుడే క్లారిటీ ఇవ్వాలనుకోవడం లేదు. ఉండొచ్చు ఉండకపోవచ్చు. సెవెన్ వరకు ఐడియాలు రెడీగా ఉన్నాయి కానీ కథలు రెడీగా లేవు' అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఆయన చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

## సూర్యుడిని కిస్ చేసిన ఆ క్షణం ఎంతో హ్యాపీగా ఉంది



'ఉప్పెన' సినిమాతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన కృతి శెట్టి గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ సినిమాతోనే బేబమ్మగా తెలుగు ఆడియన్స్ మదిలో నిలిచిపోయింది. దీంతో ఈ క్యూట్ హీరోయిన్‌కు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా చాలా సినిమాల్లో నటించినా ఉప్పెన లాంటి హిట్ అయితే రాలేదు. దీంతో కొన్ని రోజులు తెలుగు ఇండస్ట్రీకి దూరమైంది. ప్రజెంట్ ప్రదీప్ రంగనాథ్ హీరోగా నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' మూవీలో నటిస్తున్న ఈ చిన్నది.. రీసెంట్‌గా స్టార్ హీరో కార్తి నటించిన 'అన్నగారు వస్తారు' మూవీతో మన ముందుకు వచ్చింది.

నలన్ కుమార స్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. అయితే థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియా లో చేసే రచ్చ మామూలుగా ఉండదు. నిత్యం స్టైలిష్ వేర్ డ్రెస్సులతో కుర్రకారును ఫిదా చేస్తూ ఉంటుంది.

ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా కృతి శెట్టి తన ఇన్‌స్టా అకౌంట్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో బ్లాక్ జెగ్గిన్‌కు గోల్డ్ కలర్ టీషర్ట్ పెయిరప్ చేసింది. హెయిర్ లీవ్ చేసుకుని ఎండలో ఎంతో ముద్దుగా చూస్తూ కనిపించింది. ఇక వాటిని షేర్ చేస్తూ.. 'సూర్యుడిని ముద్దు పెట్టుకున్న ఆ క్షణం ఆనందంగా ఉంది' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు క్రేజీగా ఉన్నావు బేబమ్మా, సూపర్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## "నేను కేవలం బొమ్మను కాదు"

### ప్రియాంక చోప్రా ఎమోషనల్ కామెంట్స్

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా భారతీయ సినిమాల్లో స్టార్ హీరోయిన్‌గా వెలుగుతున్న సమయంలోనే ఆమె తీసుకున్న ఒక సాహసోపేత నిర్ణయం ఇప్పుడు మళ్ళీ చర్చనీయాంశమైంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక తన హాలీవుడ్ ప్రయాణంలోని కష్టనష్టాలను పంచుకున్నారు. ప్రియాంక మాట్లాడుతూ.. "30 ఏళ్ల వయసులో కెరీర్‌ను మళ్ళీ మొదటి నుంచి ప్రారంభించడం చాలా భయంకరమైన విషయం. అప్పటికే నేను భారతదేశంలో ఆర్థికంగా స్థిరపడ్డాను, స్టార్‌డమ్ ఉంది. కానీ వాటన్నింటినీ వదులుకుని అమెరికా వెళ్లాలని నిర్ణయించుకున్నాను" అని తెలిపారు. 2015లో 'మేరీ కోమ్', 'బాజీరావ్ మస్తానీ' వంటి సూపర్ హిట్ సినిమాలతో పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే ఆమె హాలీవుడ్‌కు వెళ్లడం గమనార్హం. అక్కడ ముందుగా సింగర్‌గా అడుగుపెట్టినా, ఆ తర్వాత ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది.

గ్లోబల్ స్టార్‌గా ఎదిగి.. హాలీవుడ్‌లో తనను ఎదుర్కొన్న మూస పద్ధతులు గురించి ప్రియాంక ఆసక్తికర విషయాలు చెప్పారు. "నేను మీటింగ్స్‌కు వెళ్ళినప్పుడు 'నువ్వు ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నావు' అనేవారు. భారతీయులంటే ఒక రకమైన భావన అక్కడ ఉండేది. కానీ నేను కేవలం ఒక పాత్రకే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే కథల్లో భాగం కావాలని కోరుకున్నాను" అని ఆమె వివరించారు. విరామం లేకుండా అన్నింటిలో నటించడానికి తాను కేవలం బొమ్మను కాదని.. మనిషిని అని ఆవేదన వ్యక్తం చేసింది. 'క్వాంటికో' సిరీస్‌తో మొదలైన ఆమె ప్రయాణం.. బేవాచ్, ది మ్యాట్రిక్స్ 4, , తాజా భారీ సిరీస్ 'సిటాడెల్' వరకు సక్సెస్‌ఫుల్‌గా కొనసాగింది.

ఇక ఇప్పుడు సుమారు ఎనిమిదేళ్ల విరామం తర్వాత ప్రియాంక మళ్ళీ ఇండియన్ సినిమాలో నటించబోతున్నారు. దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి రూపొందిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి' ద్వారా ఆమె రీ-ఎంట్రీ ఇస్తున్నారు. మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ఇండియన్ హిస్టరీ నేపథ్యంలో సాగే 'టైమ్ ట్రావెల్ అడ్వెంచర్'. 2027 ఏప్రిల్‌లో ఈ సినిమా విడుదల కానుంది. హాలీవుడ్‌లో గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన తర్వాత ప్రియాంక చేస్తున్న ఈ ఇండియన్ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



## 'యుఫోరియా' తప్పక చూడాల్సిన సినిమా

### గుణశేఖర్‌పై ప్రశంసలు కురిపించిన మహేష్ బాబు

విభిన్నమైన కథలతో ఎప్పటికప్పుడు తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకునే దర్శకుడు గుణ శేఖర్ గత వారం (ఫిబ్రవరి 6) 'యుఫోరియా'అంటూ బాక్సాఫీస్ సందడి చేశారు. గుణ హ్యాండ్‌మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నీలిమా గుణ, యుక్త గుణ నిర్మించిన ఈ చిత్రాన్ని రాగిణి గుణ సమర్పించారు. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గ కథ, కథాంశంతో గుణ శేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి స్పందన వచ్చింది. ఇటీవలె తెలంగాణ గౌరవ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ చిత్రాన్ని వీక్షించి సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. గుణశేఖర్ మేకింగ్‌ను ఆయన కొనియాడారు.

ప్రజలందరూ తప్పక చూడాల్సిన సినిమా అని మెచ్చుకున్నారు. తాజాగా.. మమేష్ బాబు 'వారణాసి' షూటింగ్ నుంచి బ్రేక్ తీసుకుని 'యుఫోరియా' సినిమాను చూసి తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "గుణశేఖర్ గారు తన కథలను ఎలా ప్రెజెంట్ చేస్తారనే విషయంలో ఎప్పుడూ ఓ ప్రత్యేక శైలి ఉంటుంది.. ఈ మూవీని నేను ఎంతో ఎంజాయ్ చేశాను. మరీ ముఖ్యంగా క్లైమాక్స్‌ను మలిచిన తీరు నాకెంతో నచ్చింది.. ఈ మూవీని అందరూ తప్పక చూడండి. గుణశేఖర్ గారూ, భూమిక, టీం మొత్తానికి అభినందనలు. గుణ శేఖర్ గారి మేకింగ్, ఆయన టెక్నికల్ టీం మ్యాజిక్ చేసింది" అని పోస్ట్ చేశారు. ఇక ఈ పోస్ట్ చూసిన సారా అర్జున్ ఆయనకు ధన్యవాదాలు తెలిపింది. ఈ రెండు పోస్టులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కాగా.. ఈ చిత్రంలో భూమికా చావ్లా, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్పలత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాష్, నవీనా రెడ్డి, లికిత్ నాయుడు కీలక పాత్రలో నటించారు. ప్రముఖ ఫిల్మ్ మేకర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్ పోలీస్ కమీషనర్ జయదేవ్ నాయర్ అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించారు. గౌతమ్ మీనన్ పాత్రతో పోక్సో చట్టాన్ని ఎలా ప్రయోగిస్తారు.. కేసు దర్యాప్తులో సమయంలో ఎలా సాక్ష్యాల్ని సేకరిస్తారు? అనే విషయాల్ని ఎంతో వాస్తవికంగా చిత్రీకరించారు. నీలిమా గుణశేఖర్ నిర్మించిన ఈ చిత్రానికి కాళ భైరవ సంగీతం అందించారు. ఈ చిత్రం సాంకేతికంగా కూడా ప్రత్యేకంగా నిలిచింది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే హానికరమైన పరిణామాలను హైలైట్ చేయడంతో పాటు, బాధ్యతాయుతమైన తల్లిదండ్రుల ప్రాముఖ్యతను కూడా ఈ చిత్రం నొక్కి చెప్పింది.



Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, #####, ####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com